ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
ఆదివారం 26 జనవరి 2025 | 7



మిరియాలకు పద్మశ్రీ

బుర్రకథకు ప్రాణం పెట్టిన అప్పారావు.. ఇటీవల మరణం.. దశదినకర్మ రోజున పద్మశ్రీ ప్రకటన.. రావులపాలెంలో ఇటు విషాదం.. అటు ఆనందం 8

కూటమి ప్రభుత్వం వచ్చింది.. అభివృద్ధికి బాటలు వేస్తోంది.. ఒక్కొక్కటి మార్చుకుంటూ వస్తోంది.. ప్రస్తుతం గుంతల రోడ్లు మారాయి.. ఎక్కడికక్కడ రోడ్లపై సాఫీగా ప్రయాణం సాగిపోతోంది.. వాట్ నెక్స్ట్ అందరూ అనుకుంటుండగానే.. ప్రభుత్వం మరో కొత్త సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టింది.. అదే హాస్టల్స్.. వసతి గృహాలను వహ్వా అనేలా తీర్చిదిద్దేలా నిధులు విడుదల చేస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 55 ఎస్సీ వసతి గృహాల అభివృద్ధికి రూ.8.50 కోట్లు నిధులు విడుదల చేయడం గమనార్హం.



ఏలేశ్వరంలో ఎస్సీ హాస్టల్

వసతి..మారెను గతి!

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ హాస్టళ్లకు మంచిరోజులు వచ్చాయి. నిన్నటి వరకూ ఎప్పుడు కూలిపోతాయో తెలియని పైకప్పులు.. గతుకులమయంగా మారిన గచ్చులు.. వేలాడే తలుపులు.. ఏమాత్రం రక్షణలేని కిటికీలు.. రకరకాల విషసర్పాలకు ఆలవాలంగా మరుగుదొడ్లు.. వెలగని లైట్లు.. పని చేయని కుళాయిలు.. ఇదీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సాంఘిక సంక్షేమ వసతి గృహాల దుస్థితి. గడచిన ఐదేళ్లుగా వీటి బాగోగులను గత వైసీపీ ప్రభుత్వం గాలికొది లేసింది. బటన్ నొక్కుడు మినహా విద్యార్థుల బాధలను కనీసం పట్టించుకోలేదు. దీంతో ఐదేళ్ల నుంచీ అనేక అవస్థల మధ్య విద్యార్థులు పడ్డ నరకయాతన అంతా ఇంతా కాదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వీటిని మార్చబోతోంది. ఐదేళ్లపాటు బాగోగులకు నోచుకోని వసతి గృహాలకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలని నిర్ణయించింది. విద్యార్థులు ఇబ్బంది పడకుండా ఏకంగా రూ.8.50 కోట్లతో మరమ్మతులకు ఆమోదం తెలిపింది. దీంతో పనులు చేయడానికి వీలుగా అధికారులు ఎట్టకేలకు టెండర్లు పిలిచారు. వచ్చే నెలలో ఇవన్నీ మొదలు కానున్నాయి. అటు ఉమ్మడి జిల్లాలో రూ.70 లక్షలతో 16 బీసీ హాస్టళ్ల మరమ్మతులకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

నిధుల కేటాయింపులిలా..

ఎస్సీ, బీసీ హాస్టళ్లపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. వసతిగృహాల్లో సమస్యలను పరిష్కరించాలని నిర్ణయించింది. అధికారులు ఇటీవల ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపడంతో రూ.8.50 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో త్వరలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 55 ఎస్సీ బాల బాలికల వసతి గృహాలకు పూర్తిస్థాయి మరమ్మతులు చేయనున్నారు. ఇందులో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 22 ఎస్సీ వసతి గృహాలకు రూ.4.93 కోట్లతో రిపేర్లు చేయనున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 20 వసతి గృహాలకు రూ.3.83 కోట్లు, కాకినాడ జిల్లాలో 13 హాస్టళ్లకు రూ.1.23 కోట్లతో మరమ్మతులకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఒక్కో వసతిగృహానికి అక్కడ అవసరాలను బట్టి రూ.10 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు నిధులు మంజూరు చేసింది. ప్రధానంగా కోనసీమ జిల్లాలో కె.గంగవరం హాస్టల్ మరమ్మతులకు రూ.8.80లక్షలు, ఉప్పలగుప్తం రూ.14.60 లక్షలు, ముమ్మిడివరం రూ.17.60 లక్షలు, రావులపాలెం రూ.17.30 లక్షలు, అంబాజీపేట రూ.22.40 లక్షలు, ఆలమూరు రూ.25లక్షలు, రామచంద్రపురం రూ.35.30 లక్షలు. రాజమహేంద్రవరం-1 రూ.17.20 లక్షలు, ధవళేశ్వరం రూ.24.96 లక్షలు, పెద్దాపురం రూ.6.15లక్షలు. కాకినాడ అర్బన్‌లో రూ.19.50 లక్షల చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కాకినాడ జిల్లాలో తొమ్మిది బీసీ బాలబాలిక వసతిగృహాల మరమ్మతులకు రూ.38లక్షలు, తూర్పుగోదావరి జిల్లాలో 8 బీసీ హాస్టళ్ల మరమ్మతులకు రూ.29.50 లక్షల చొప్పున ప్రతిపాదనలు ప్రభుత్వానికి వెళ్లాయి. వీటికి కూడా త్వరలో టెండర్లు పిలవనున్నారు.

- ఎస్సీ హాస్టళ్లకు మంచిరోజులు
- 55 హాస్టళ్లకు రూ.8.50 కోట్లు
- ఉమ్మడి జిల్లాకు కేటాయింపు
- కూటమి సర్కారు నిర్ణయం
- హాస్టళ్ల మరమ్మతులపై దృష్టి
- టెండర్లు పిలిచిన అధికారులు
- వచ్చే నెల నుంచి పనులు
- బీసీ హాస్టళ్లకు రూ.70 లక్షలు

ఏం చేస్తారంటే..

పైకప్పుల మరమ్మతు చేపట్టి వసతిగృహాల్లో ఇకపై శ్లాబ్‌లకు ఇబ్బంది లేకుండా సురక్షితంగా ఉండేలా తీర్చిదిద్దనున్నారు. అలాగే గచ్చులు,తలుపులు ,కిటికీలకు మరమ్మతులు చేయనున్నారు. విద్యుత్, తాగునీటి సమస్యలకు పరిష్కారం చూపుతారు. ఎక్కడికక్కడ కొత్త ట్యాంకుల నిర్మాణం, కుళాయిల ఏర్పాటు, కొత్త వైరింగ్ చేయనున్నారు. ఈ పనులు ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఈడబ్ల్యూఐడీసీ), ఆర్‌డబ్ల్యూ ఎస్,పీఆర్ ఇంజనీరింగ్ విభాగాల ఆధ్వర్యంలో జరగనున్నాయి. ఇటీవల ఈ విభాగాలు టెండర్లు పిలిచాయి. వచ్చేనెల రెండో వారం నుంచి పనులు ప్రారంభంకానున్నాయి.



సీఎస్ విజయానంద్ నుంచి అవార్డు అందుకుంటున్న ఆర్‌డీవో రాణిసుస్మిత

కొవ్వూరు ఆర్‌డీవో రాణి సుస్మితకు అవార్డు

కొవ్వూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు నియోజకవర్గంలో 98 శాతం పైగా యువ ఓటర్ల నమోదు చేయడంతో కొవ్వూరు ఆర్డీవో డా. రాణి సుస్మిత ఉత్తమ ఎలక్ట్రోరల్ అధికారిగా అవార్డు అందుకున్నారు. రాష్ట్రంలో ఎలక్ట్రోరల్ జాబితా రూపకల్పనలో ఉత్తమ పనితీరు కనబర్చిన 11 మంది రెవెన్యూ అధికారులను అవార్డుకు ఎంపిక చేశారు. కొవ్వూరు డివిజన్ పరిధిలో 18 నుంచి 19 ఏళ్ల మధ్య వయస్సు యువ ఓటర్ల నమోదులో 98 శాతం పైగా నమోదు చేశారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ ఎలక్ట్రోరల్ అధికారిగా కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, ఏఈఆర్వోగా కొవ్వూరు తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్‌లకు సీఎస్ విజయానంద్ అవార్డులను అందజేశారు. కలెక్టర్ పి.ప్రశాంతి, జేసీ ఎస్.చిన్నరాముడు అభినందించారు.

విమానాశ్రయ టెర్మినల్ పరిశీలించిన మంత్రి, ఎంపీ 8



లే..ఔట్!

ఇంకనూ తేలని భాస్కర్ నగర్ అక్రమాల డొంక

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

లెక్కతేలుస్తాం..అక్రమాల పనిపడతాం అంటూ అధికారులు రంగంలోకి దిగారు.. సుమారు నెలరోజుల పాటు సర్వే చేసి ఏమీ తేల్చలేకపోయారు..ఇదీ కోట్లాది రూపాయల విలువైన స్థలాలున్న రాజమండ్రి పబ్లిక్ సర్వీస్ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ స్థలాలు (భాస్కర్ నగర్ లేవుట్)లో పరిస్థితి..ఈ లేఅవుట్‌లో మొత్తం 278 పాట్లు ఉన్నాయి.అధికారులు నెల రోజులు పాటుపడి 103 ప్లాట్లను వెరిఫై చేశారు. సుమారు 155 ప్లాట్లు అన్యాక్రాంతమైనట్లు ప్రాథమిక అంచనా వేసిన సంగతి తెలిసిందే. చట్టప్రకారం అర్హులకు న్యాయం చేయడానికి, రికార్డులు లేనివాటిని స్వాధీనం చేసుకోవడానికి నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. ఈ మేరకు ప్రభుత్వ లాయర్ అభిప్రాయం కోరుతూ కలెక్టర్ లేఖ కూడా రాశారు.

'ఆంధ్రజ్యోతి' కథనంతో కదలిక

భాస్కర్‌నగర్ లేఅవుట్‌లో అక్రమాలపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై కలెక్టర్ ప్రశాంతి స్పందించి అధికార యంత్రాంగాన్ని సమాయత్తం చేశారు. అధికారులతో కమిటీ వేసి వివరాలు సేకరించి తర్వాత మొత్తం సర్వే చేయాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గత నెలలో జిల్లా కోఆపరేటివ్, రెవెన్యూ అధికారుల సమక్షంలో మూడు రోజుల పాటు సర్వే చేసి సుమారు 155 ప్లాట్ల వివరాలు తేల్చారు. ఈలోపు సర్వేయర్లకు వేరే పనులు ఉండడంతో సర్వే నిలిచిపోయింది. త్వరలో మరింత మంది సర్వేయర్లను ఏర్పాటు చేసి మొత్తం ప్లాట్ల వివరాలన్నీ సేకరిస్తామని అధికారులు చెబుతున్నారు. కానీ ఇదే వేడిలో పూర్తి చేసి అక్రమాల నిగ్గు తేల్చితే కోట్లాది రూపాయల కుంభకోణం బయటపడుతుంది. రాజకీయనేతలు, రౌడీషీటర్ల అండతోనే అక్రమాలు పెచ్చుమీరిన సంగతి తెలిసిందే. తాత్సారం జరిగే కొద్దీ అక్రమార్కులు రకరకాల ఎత్తుగడలు వేసే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. సర్వే పూర్తయితే ఏళ్ల తరబడి ఉన్న సమస్యకు పరిష్కారం లభిస్తోంది.

అయ్యో పాపం అధికారులు

గతం లో అక్రమాలకు పాల్పడిన వారంతా బాగా సంపాదించుకుని పెత్తందార్లుగా మారిపోయారు.వారి ఊబిలో పడిన అధికారులు కోర్టు చుట్టూ తిరుగుతున్నారు.రెండు ప్లాట్ల విషయంలో కోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయకుండా ఇష్టానుసారం వ్యవహరించిన సహకార శాఖపై కోర్టు ధిక్కార ఆదేశాలు రావడంతో వారంతా దాని నుంచి బయట పడడానికి తంటాలు పడుతున్నారు.కోర్టు చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటికే ఇక్కడి పరిస్థితిపై కమిటీ వేసి ఒక నివేదిక కూడా రప్పించుకున్న తర్వాతే సర్వేకు ఆదేశించారు.ఈ మేరకు వాస్తవంగా అర్హులకు న్యాయం చేయడంతో పాటు రికార్డులులేనివి, అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లిన వాటిన ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి.

- గతంలో నెల రోజులు సర్వే
- భాస్కర్‌నగర్‌లో 278 ప్లాట్లు
- గత సర్వేలో 103 పరిశీలన
- 155 ప్లాట్లు అన్యాక్రాంతం?
- స్వాధీనానికి కలెక్టర్ మొగ్గు
- త్వరలో మళ్లీ సర్వేకు ఆదేశం
- భూ కుంభకోణంపై దృష్టి
- తవ్వేకొద్దీ అక్రమాలు



గీత మార్చెను!

హామీని నిలబెట్టుకున్న కూటమి

రాజమహేంద్రవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా గీత కులాలకు మద్యం షాపులు కేటాయించింది. 10 శాతం షాపులను ఇచ్చింది.ఆయా ప్రాంతాల్లో ఉన్న గీత కులాల్లోని ఉపకులాల వారీ కేటాయింపులు జరిగాయి. చరిత్రలో ఏనాడూ లేని విధంగా సగం రాయతీతో గీత కులాలకు మద్యం షాపులు కేటాయించడం పట్ల ఆయా వర్గీయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టరేట్‌లో శనివారం కలెక్టర్ పి.ప్రశాంతి, జేసీ ఎస్.చిన్నరాముడు ఆధ్వర్యంలో మండలాల వారీ లాటరీ తీసి, షాపులు కేటాయించినట్టు జిల్లా ఎక్సయిజ్ సూపరింటెండెంట్ లావణ్య తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 13 మండలాల్లో ఈ దుకాణాలు కేటాయించారు. రాజమహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్ పరిధి, బిక్కవోలు, చాగల్లు, దేవరపల్లి, గోపాలపురం, కడియం, కోరుకొండ, పెరవలి, రంగంపేట, సీతానగరం, తాళ్లపూడి మండలాల పరిధిలో ఒక్కొక్క మద్యం దుకాణం వంతున గీత కులాల్లో ఒక కులమైన శెట్టిబలిజలకు కేటాయించారు. అనపర్తిలో గౌడ్ కులానికి 1, నిడదవోలు రూరల్‌లో గౌడ కులానికి 1 కేటాయించారు. మండలాల్లో దుకాణానికి రూ. 32.5 లక్షలు,రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలో 42.5 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది.ఇతరులు గతంలో వీటికి రెట్టింపు ఫీజు చెల్లించారు. అప్లికేషన్ ఫీజు రూ.2 లక్షలు చెల్లించాలి. ప్రభుత్వం దుకాణాలను గెజిట్ రూపంలో ప్రకటించనుంది.ఈ ప్రకటన వచ్చిన వెంటనే దుకాణాలు మొదలు పెట్టుకోవచ్చని అధికారులు తెలిపారు.రాజమహేంద్రవరం గౌడ-శెట్టిబలిజ సంఘం గౌరవాధ్యక్షుడు బుడ్డిగ శ్రీనివాస్ ప్రభుత్వ నిర్ణయంపై అభ్యంతరం తెలిపారు. ఎన్నికల ముందు కూటమి 20 శాతం షాపులు గీత కులాలకు కేటాయిస్తానని,ఇవాళ 10 శాతమే కేటాయించిందన్నారు.ఈ షాపులను వ్యక్తులకు కాకుండా గీత కార్మికుల సొసైటీలకు కేటాయిం చాలని డిమాండ్ చేశారు.

- 10 శాతం మద్యం దుకాణాలు
- 13 మండలాలకు కేటాయింపు
- మండలంలో రూ.32.5 లక్షలు
- కార్పొరేషన్‌లో రూ.42.5 లక్షలు
- శెట్టిబలిజలకు 11 షాపులు
- గౌడ కులస్తులకు ఒకటి
- గౌడ్ కులస్తులకు మరొకటి
- ఆయా వర్గీయుల ఆనందం
- 20 శాతం ఇవ్వాలని డిమాండ్



కోటికేశవరం దళితవాడలో సహపంక్తి భోజనాలు చేస్తున్న ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రుడా చైర్మన్‌బొడ్డు వెంకటరమణ చౌదరి

విందు.. పసందు

కోటికేశవరంలో నాయకుల సహపంక్తి భోజనం

కోరుకొండ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : భారత ప్రధాని నరేంద్రమోదీ సంవిధాన్ గౌరవ దివాస్ కార్యక్రమంలో భాగంగా శనివారం రాజానగరం నియోజకవర్గం కోరుకొండ మండలం కోటికేశవరం దళితవాడలో ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి పర్యటించారు.ఈ సందర్భంగా ఎంపీ దళితులతో సమావేశమై పలు విషయాలు చర్చించారు.అనంతరం వారితో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.ఎంపీ మాట్లాడుతూ నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవంగా ప్రధాని మోదీ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకం అన్నారు. భారత రాజ్యాంగం 75వ వార్షికోత్సవం సందర్భంగా హమరా సంవిధాన్...హమరా స్వాభిమాన్ పేరుతో దేశ వ్యాప్తంగా ఉత్సవాలు జరుపుతున్నట్టు ఎంపీ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఏపీఆర్ చౌదరి, టీడీపీ నాయకులు తనకాల నాగేశ్వరరావు, గ్రామ సర్పంచ్ మూడే సింధు దివ్య, అడపా వీరబాబు, పలువురు జనసైనికులు,బీజేపీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు గణతంత్ర దినోత్సవం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్ గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముస్తాబైంది.ఈ మేరకు జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. కలెక్టర్ ప్రశాంతి ఆదేశాలతో జిల్లాలో 17 శాఖలకు సంబంధించిన అభివృద్ధి శకటాలను ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఏడు స్టాల్స్ సిద్ధం చేశారు. వీటిని గణతంత్ర దినోత్సవంలో ప్రదర్శించనున్నారు. ఏర్పాట్లను జేసీ ఎస్.చిన్నరాముడు,ఆర్‌డీవో కృష్ణ నాయక్ ఇతర అధికారులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. 76వ గణతంత్ర దినోత్సవంలో జాతీయ స్ఫూర్తి, రాష్ట్ర ,కేంద్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న సంక్షేమ ,అభివృద్ధి పథకాల కార్యక్రమాలతో కూడిన శకటాలు ప్రదర్శిస్తామన్నారు. శకటాల్లో డీఆర్‌డీఏ, ముఖ్యప్రణాళిక , హౌసింగ్, పరిశ్రమలు అండ్ వాణిజ్యవిభాగం, పర్యాటక, నైపుణ్యాభివృద్ధి, ఉన్నత విద్య, ఆరోగ్యం వైద్యం కుటుంబ సంక్షేమం, మహిళా శిశు సంక్షేమం, జలవనరులు, నీటిపారుదల ,వ్యవసాయం, మత్స్యశాఖ, మునిసిపల్‌శాఖ , అగ్రికల్చర్, జాతీయ ఓటరు దినోత్సవ ప్రచార శకటాలు ప్రదర్శిస్తారు. అదేవిధంగా హోమ్‌సెన్సార్ యుటిలైజేషన్ ఏడు స్టాల్స్ ఏర్పాటు చేసినట్టు జేసీ తెలిపారు.



గణతంత్ర దినోత్సవానికి ముస్తాబైన ఆర్ట్స్ కళాశాల ప్రాంగణం



న్యూ ఢిల్లీకి కె.సావరం సర్పంచ్



ఉండ్రాజవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : రిపబ్లిక్ డే సందర్భంగా న్యూఢిల్లీలో ఆదివారం జరిగే కార్యక్రమానికి ఆహ్వానం అందినట్టు మండలంలోని కె.సావరం సర్పంచ్ నార్ని రామకృష్ణ శనివారం విలేకరులకు తెలిపారు. సర్పంచ్‌ల నుంచి పరేడ్‌కు హాజరయ్యేందుకు తూర్పుగోదావరి జిల్లా నుంచి తనకు అరుదైన అవకాశం వచ్చిందన్నారు. ఈ అవకాశం కల్పించిన పంచాయతీరాజ్ మంత్రి పవన్‌కల్యాణ్, పర్యాటక, సాంస్కృతిక శాఖామంత్రి కందుల దుర్గేష్‌లకు సర్పంచ్ రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

ఫ్రంట్‌లైన్ హెల్త్ వర్కర్ దేవికి అరుదైన గౌరవం



రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఫ్రంట్‌లైన్ హెల్త్ వర్కర్ పెనుగొండ దేవి వరలక్ష్మికి అరుదైన గౌరవం లభించింది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఆధ్వర్యంలో రాజ్‌భవన్‌లో ఆదివారం జరిగే ఎట్ హోం కార్యక్రమానికి దేవి వరలక్ష్మిని ఆహ్వానించినట్టు డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు తెలిపారు.ఆమె ధవళేశ్వరం పీహెచ్‌సీ ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్ పిడింగొయ్యి -3లో ఎంఎల్‌హెచ్‌పీగా పనిచేస్తున్నారు.



భారత దేశంలో ప్రజాస్వామ్యానికి పూనాది ఓటు హక్కు అని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి అన్నారు. రాజమహేంద్రవరంలో శనివారం జరిగిన ఓటరు దినోత్సవానికి కలెక్టర్ ప్రశాంతి హాజరయ్యారు. తొలుత వైజంక్షన్ నుంచి నిర్వహించిన ఓటరు దినోత్సవ ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ ఆనం కళాకేంద్రానికి చేరుకుంది.. అక్కడ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఎగరాలి మువ్వన్నెల జెండా

కొవ్వూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కొవ్వూరు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ హైస్కూల్ విద్యార్థులు 100 అడుగుల జాతీయ పతాకంతో పట్టణ పుర వీధుల్లో ర్యాలీ చేశారు. కొవ్వూరు థియేటర్ సెంటర్‌లోని డా.ఎస్ఆర్‌కె హైస్కూల్ విద్యార్థులు జాతీయ నాయకుల వేషధారణలు ధరించి శనివారం 100 అడుగుల జాతీయ పతాకంతో అల్లూరి సీతారామరాజు సెంటర్, విజయవిహార్ మీదుగా బస్టాండ్ సెంటర్ నుంచి తిరిగి మరలా పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రధాన సెంటర్లలో రిపబ్లిక్ డే ప్రత్యేకతను తెలియజేస్తూ విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేలా నృత్య ప్రదర్శనలు చేశారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



వాడపల్లి భక్త జనసంద్రం

- ఏకాదశి కావడంతో భారీ సంఖ్యలో భక్తుల రాక
- వెంకన్న నామ స్మరణతో మార్మోగిన ఆలయం
- శనివారం ఒక్కరోజు ఆదాయం రూ.37.54 లక్షలు



భక్తులతో రద్దీగా ఉన్న వెంకన్న ఆలయ ప్రాంగణం

ఆత్రేయపురం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఏకాదశి కావడంతో వివిధ రాష్ట్రాల నుంచి భారీగా తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం గోవిందనామస్మరణతో మార్మోగింది. వేకువ జామునే స్వామి వారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలబోగం , తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో స్వామివారిని అలకరించారు. స్వర్ణశోభితుడైన శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తీరువీధులలో ఏడు ప్రదక్షిణలు జరిపారు. భారీ క్యూలైన్ల ద్వారా మండపం నుంచి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు తులభారాలు, కానుకలు సమర్పించారు. రాజమహేంద్రవరానికి చెందిన శ్రీలలిత కళానికేతన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్యప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.37.54 లక్షలు లభించినట్టు ఆలయ ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. స్వామివారిని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కుటుంబసభ్యులతో వచ్చి దర్శించుకున్నారు. అర్చకులు వేదమంత్రాలతో ఘన స్వాగతం పలికి, విశేష పూజలు అందించారు. ఉపకమిషనర్ సూర్యచక్రధరరావు స్వామి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు. ఎంపీ అప్పలనాయుడు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావును మర్యాదపూర్వకంగా కలిశారు.



విజయనగరం ఎంపీ అప్పలనాయుడుకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఉప కమిషనర్ చక్రధరరావు

'మిరియాల'కు పద్మశ్రీ అవార్డు



సీఎం చంద్రబాబుతో మిరియాల అప్పారావు(ఫైల్)

- కళకు ప్రాణం పెట్టిన అప్పారావు
- బుర్రకథకు ప్రత్యేక గుర్తింపు ఈయనతోనే
- బుర్రకథతో ప్రేక్షకులను మెప్పించడంలో దిట్ట
- 365 రోజుల్లో 300 బుర్రకథలు
- 5వేలకు పైగా బుర్రకథల స్టేజీ ప్రోగ్రాంలు.. ఎన్నో అవార్డులు, బిరుదులు
- పుట్టింది కాకినాడ జిల్లా నడకుదురు
- అనారోగ్యంతో ఈనెల 15న రావులపాలెంలో మృతి.. శనివారం దశదినకర్మ రోజేనే పద్మశ్రీ ప్రకటన

రావులపాలెం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సినిమాలు, టీవీలు ప్రాచుర్యం లేని రోజుల్లో బుర్రకథకు మంచి క్రేజ్ ఉండేది. జాతర్లలో కళాకారులు స్టేజీపై బుర్రకథ చెబుతుంటే ప్రేక్షకులు ఈలలు, కేరింతలు, తప్పట్లతో కళాకారులను ప్రోత్సహిస్తుంటే, ఆ కథలు తెల్లవారే దాకా అలుపెరగకుండా కళాకారులు కళకు ప్రాణం పెట్టి బుర్రకథను చెప్పేవారు. కళకు ప్రాణం పెట్టి ఆ కళలో నవరసాలు పండించడంలో మిరియాల అప్పారావుకు సాటిలేరు అంటే అది అక్షరసత్యం. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతో ముఖ్యంగా కోనసీమతో అనుబంధం ఉన్న మిరియాల అప్పారావు 1949లో కరప మండలం నడకుదురు గ్రామంలో మిరియాల వెంకటరామయ్య- తిరుపతమ్మలకు జన్మించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో 1969లో బుర్రకథ రంగంలో అడుగుపెట్టి డ్రాయింగ్ మాస్టర్, జూనియర్ నాజర్, రామిశెట్టి వీరేశం గురువుల వద్ద శిష్యరికం చేసి ప్రధాన కథకునిగా ప్రావీణ్యం పొందారు. అనంతరం అక్కడ మొదలుపెట్టిన ప్రస్థానం వెనుతిరిగి చూడకుండా ఎన్నో స్టేజీ ప్రోగ్రాంలు చేశారు. 1974లో ఆల్ఇండియా రేడియోలో, 1993లో దూరదర్శన్‌లో ప్రోగ్రాంలు ఇచ్చారు. 1975లో పెద్దాపురంలో నిర్వహించిన బుర్రకథ పోటీలో ప్రథమస్థానం సాధించి 50 తులాల వెండి కప్‌ను ముప్పన రామారావు చేతుల మీదుగా అందుకున్నారు. 365 రోజుల్లో 300 రోజులు బుర్రకథ చెప్పిన ఘనుడు ఈయన. 50 ఏళ్ల బుర్రకథ ప్రస్థానంలో అలుపెరగకుండా ఎన్నో స్టేజీ ప్రదర్శనలు చేసి ప్రేక్షకుల మన్ననలను పొందారు. ప్రస్తుతం బుర్రకథ చెప్పేవారిలో 70 శాతం మంది కళాకారులు ఈయన శిష్యులే. ఈయనకు గానగంధర్వ, గాన కోకిల, బుర్రకథ టైగర్, బుర్రకథ మాస్టర్, బుర్రకథ పితామహుడు, వైఎస్సార్ లైఫ్ అచీవ్‌మెంట్ తదితర అవార్డులను, బిరుదులను పొందారు.

5 వేలకు పైగా స్టేజీ ప్రోగ్రామ్‌లు...

కళల రంగంలో ప్రావీణ్యం చెందిన మిరియాల అప్పారావు నవరసాలు పండించడంలో ప్రత్యేక స్థానం సాధించుకున్నారు. దీనిలో భాగంగా ఆయన తణుకు షణ్ముఖ ఆంజనేయరాజు నేతృత్వంలోని నాటక కళా సమితిలో పలు నాటకాల్లోనూ ఈయన నటించారు. శ్రీకృష్ణతులాభారంలో కృష్ణుడు, చింతామణిలో బిల్వమంగళుడు పాత్రలతో ప్రేక్షకుల మదిని దోచారు. ఈయన 1969 నుంచి ప్రారంభించిన స్టేజీ ప్రోగ్రాంలు ఆయన ఓపిక ఉన్నంత వరకు కొనసాగిస్తు వచ్చారు. ఇప్పటివరకు 5 వేలకుపైగా స్టేజీ ప్రోగ్రామ్‌లు ప్రదర్శించారు.



కుటుంబమే కళారంగం....

మిరియాల అప్పారావు కుటుంబం ఆయనతోపాటు కళారంగంలోనే కొనసాగుతున్నారు. అప్పారావుకు భార్య, ఐదుగురు సంతానం ఉన్నారు. వారిలో రావులపాలెంలో ఉంటున్న బ్రహ్మాజీ, సుబ్బరాజు, బాబా అనే కుమారులు, వీరనాల లలిత (రావులపాలెం) యడవల్లి శ్రీదేవి (తాడేపల్లిగూడెం) అనే ఇద్దరు కుమార్తెలు కూడా బుర్రకథ కళారంగంలోనే కొనసాగుతుండడం విశేషం.

విచారకరంలో ఆనందకరమైన విషయం..

ఎన్నో స్టేజీ ప్రొగ్రామ్‌లు అందించి ఎందరో ప్రేక్షకులన మన్నలను పొంది కళారంగానికి వన్నెతెచ్చిన మిరియాల అప్పారావు ఈనెల 15వ తేదీన అనారోగ్యంతో రావులపాలెంలోని ఆయన కుమారుడు బ్రహ్మాజీ ఇంటి వద్ద తుదిశ్వాస విడిచారు. కళారంగంలో ప్రావీణ్యం చెందిన అప్పారావు మృతితో కుటుంబ సభ్యులు, ఆయన శిష్యబృందం విచాకరంలో ఉండగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మశ్రీ అవార్డుతో ఆనందం వ్యక్తం చేశారు. ఆయన పద్మశ్రీ అవార్డుకు ఎంపిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

నాలుగేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి యత్నం

- పోలీసుల గాలింపు ముమ్మరం

పెద్దాపురం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): కామంతో కళ్లు మూసుకుపోయిన ఓ కామాంధుడు నాలుగేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి యత్నించిన ఘటన కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని జె.తిమ్మాపురంలో శనివారం జరిగింది. చిన్నారి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఓ మహిళకు ఇద్దరు ఆడపిల్లలు పుట్టారని భర్త వదిలేశాడు. దీంతో చిన్నారులను పోషించుకునేందుకు ఆ తల్లి కూలీ పనులకు వెళ్తోంది. గ్రామంలో అంగన్‌వాడీ పాఠశాలకు వెళ్లి ఇంటికి వచ్చిన చిన్నారి ఇంట్లో ఒంటరిగా ఉండడం గమనించిన పాలిక వీరబాబు అనే కామాంధుడు చిన్నారిపై లైంగిక దాడికి యత్నించడంతో చిన్నారి గట్టిగా ఏడ్చింది. ఇది గమనించిన స్థానికులు అక్కడకు రావడంతో వీరబాబు పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వి.మౌనిక విచారణ ప్రారంభించారు. దీనిపై కేసు నమోదు కావాల్సి ఉంది. నిందితుడు పరారవ్వడంతో పోలీసులు అతడి కోసం గాలింపు చర్యలను చేపట్టారు.

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం

- ప్రమాదంపై పూర్తిస్థాయి విచారణ
- విమానాశ్రయ ఘటనపై స్పందించిన మంత్రి కందుల దుర్గేష్



విమానాశ్రయం వద్ద కూలిన టెర్మినల్ షెడ్‌ను పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే బలరామకృష్ణ

కోరుకొండ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మధురపూడి విమానాశ్రయం (రాజమహేంద్రవరం) టెర్మినల్ విస్తరణ పనుల్లో జరిగిన సంఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపించి, బాధ్యులపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. శనివారం రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణతో కలిసి విమానాశ్రయంలో జరిగిన ప్రమాదస్థలిని పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. కొంత కాలంగా ఇక్కడ టెర్మినల్ విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో మొదటి అంతస్తు పై కప్పు ఏర్పాటు చేస్తుండగా పైన ఉన్న గిడ్డర్ల బోల్టులు బిగించడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. అదృష్టవశాత్తూ ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పిందన్నారు. ఏదిఏమైనా ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు మరింత జాగ్రత్త వహించాలన్నారు. ఈ విషయంపై కేంద్రపౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో మాట్లాడతామన్నారు. దీనికి సంబంధించి నివేదికను అధికారులతో తెప్పించుకుని ఏ విధంగా ముందుకెళ్లాలో పరిశీలిస్తామన్నారు. మంత్రి వెంట ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి నాయకులు ఉన్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన వారిలో రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, కలెక్టర్ పి.ప్రశాంతి, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

ఎంపీ పురందేశ్వరి పరిశీలన

విమానాశ్రయంలో కూలిన టెర్మినల్ ప్రదేశాన్ని శనివారం రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి పరిశీలించారు. అనంతరం అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పైన ఉన్న గిర్డర్ల బోల్ట్‌లు బిగించడం వల్లే ప్రమాదం జరిగినట్టు ఆమెకు అధికారులు వివరించారు. కాంట్రాక్ట్ తీసుకున్న చెన్నై రెనాటస్ ప్రాజెక్టు ఎండీ మనోజ్ పూసప్పన్, వైస్ ప్రెసిడెంట్ ఖరుబాకరమ్, ప్రాజెక్టు డీజీఎం శరవణ్‌ను నిలదీశారు. ఈ ఘటనపై ఎంపీ మీడియా అడిగిన ప్రశ్నలకు బదులిస్తూ కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడుతో మాట్లాడానన్నారు. ఇప్పటికే విమానయాన అధికారులు విచారణ చేపట్టారని చెప్పారు. నివేదిక అందిన తరువాత నిర్మాణంలో లోపాలు ఉన్నట్టు తేలితే బాధ్యులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు.



అధికారులను వివరాలు అడుగుతున్న ఎంపీ పురందేశ్వరి

మేరా భారత్ మహాన్

● పల్ల వెంకన్న నర్సరీలో ఆకట్టుకుంటున్న ఎర్రకోట వనకూర్పు ఆకృతి



నర్సరీలో మొక్కలతో రూపొందించిన రిపబ్లిక్ డే ఆకృతి

కడియం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): కడియపులంకలోని పల్ల వెంకన్న నర్సరీలో పల్ల సత్తిబాబు, ఆయన కుమారులైన వెంకటేష్, వినయ్ మేరా భారత్ మహాన్ అంటూ మొక్కలతో రిపబ్లిక్ డే ఆకృతులను రూపొందించారు. మువ్వన్నెల జెండా, ఎర్రకోటతో అక్షరమాలికను తీర్చిదిద్దారు. 76వ వసంతంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా దీన్ని ఏర్పాటు చేసినట్టు పల్ల సత్తిబాబు, వెంకటేష్, వినయ్ తెలిపారు.

మద్యానికి బానిసై... భార్యతో తరచూ గొడవలు

- అత్తమామ చేతిలో ప్రాణాలు కోల్పోయిన అల్లుడు



గణేష్ మృతదేహం

కడియం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి):మద్యానికి అలవాటు పడి భార్యతో తరచూ గొడవ పడుతున్న వ్యక్తి అత్తమామ చేతిలో ప్రాణా లు కోల్పోయిన ఉదంతం కడియపులంకలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ... కోరుకొండ గ్రామానికి చెందిన శ్రీరంగం సూర్యవెంకట గణేష్ (36) రెండేళ్ల కిందట తన భార్య మాదవి, ఇద్దరు పిల్లలతో కలిసి కడియపులంకలో నివాస ముంటున్నాడు. గణేష్‌కు మద్యం సేవించే అలవా టు ఉంది. ఈ నేపథ్యంలో భార్యతో తరచూ గొడవపడేవాడు. ఎప్పటిలాగే ఈనెల 24వ తేదీ సాయంత్రం మద్యం సేవించి ఇంటికి వచ్చి తన భార్యతో ఘర్షణ పడ్డాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న గణేష్ అత్త నాగమణి, మామ సత్తిబాబు అడ్డుపడి తలమీద బలంగా కొట్టి గాయపరిచారు. దీంతో విషయం తెలుసుకున్న గణేష్ బంధువులు 108లో హెచ్‌సీకి తరలించారు. అయితే వైద్యులు అప్పటికే చనిపోయినట్టు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి ఉదయ భాస్కరరావు ఫిర్యాదు మేరకు సీఐ ఏ. వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సత్యదేవుడి సన్నిధిలో రైల్వే డీఆర్ఎం పూజలు



దర్శనాంతరం డీఆర్ఎంతో మాట్లాడుతున్న ఈవో సుబ్బారావు

అన్నవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడిని శనివారం విజయవాడ డివిజినల్ రైల్వే మేనేజర్(డీఆర్ఎం) నరేం ద్ర ఆనందరావు పాటిల్ కుటుంబసభ్యులతో దర్శించుకున్నారు. దీనిలో భాగంగా స్వామి వారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందించి, స్వామివారి ప్రసాదాలు ప్రదానం చేశారు. వీరితోపాటు పీఆర్వో కృష్ణారావు, ఏఈవో కొండలరావు, తదితరులు ఉన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



ఈవోకు విరాళం అందజేస్తున్న దాత పెంటయ్య

అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నితాన్న దాన పథకానికి శనివారం ఓ దాత రూ.లక్ష విరాళంగా సమర్పించారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలుకు చెందిన మురముళ్ల పెంటయ్య ఈ మొత్తాన్ని ఈవో సుబ్బారావుకు అందజేశారు. దాతను ఆయన అభినందించి ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించి స్వామివారి ప్రసాదం ఇచ్చారు.

రెండోరోజూ రాష్ట్రస్థాయి ఆహ్వాన నాటిక పోటీలు



రెండోరోజు పోటీలను ప్రారంభిస్తున్న అజాద్ నేషనల్ ఆర్మీ అధ్యక్షుడు కోటి

పెద్దాపురం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): : ప్రజల జీవితాలను ప్రతిబింబించేదే కళ అని ఆజాద్ నేషనల్ ఆర్మీ అధ్యక్షుడు కొత్తిం వెంకట శ్రీనివాసరావు(కోటి) అన్నారు. పెద్దాపురం మం డలంలోని చంద్రమాంపల్లిలో స్నేహ ఆర్ట్స్ నాటక పరిషత్ ఆధ్వర్యంలో గుమ్ములూరి లక్ష్మీ నారాయణ కళాప్రాంగణంలో ఉభయ రాష్ట్రాల రాష్ట్రస్థాయి ఆహ్వాన నాటికల పోటీలు రెండోరోజు శనివారమూ కొనసాగాయి. కురుమెళ్ల వెంకటరమణ, మరుకుర్తి సత్తిబాబు కళావే దికపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్నేహ ఆర్ట్స్ అధ్యక్షుడు గొందేసి రాజా, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ కూనిరెడ్డి అరుణ, ఇంధన బ్రహ్మానందం, స్వామినాథన్, దేవాడ పాపేశ్వరరావు, గోపు నారాయణమూర్తి , తదితరులు పాల్గొన్నారు.

చక్కటి సందేశాన్నిచ్చిన స్వేచ్ఛనాటిక..

స్వేచ్ఛ అంటే యథేచ్ఛ కాదని, మన మనసుకు నచ్చినట్టు మన ఇష్టం వచ్చినట్టు విచ్చలవిడిగా ఏదిపడితే అది చేయడానికి ఆడ, మగ ఎవరైనా స్వేచ్ఛలో నిర్ణయాత్మక నియంత్రణ సంరక్షణతో కూడిన నియంత్రణ ఉండాలని, స్వేచ్ఛకు హద్దే ముద్దు అని చక్కటి సందేశాన్ని ఇచ్చేలా ప్రదర్శన సాగింది. సహృదయ ద్రోణాదుల(బాపట్ల) వారు ప్రదర్శించిన వర్క్ ఫ్రం హోమ్ ఆద్యంతం హాస్యభరితంగా సాగింది. ఆహూతులను నవ్వులు పూయించింది. వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ (వెలగలేరు) వారు ప్రదర్శించిన రాత నాటిక ఎంతగానో ఆకట్టుకుం ది. పోలుదాసు శ్రీనివాసరావు ఈ నాటికకు రచన, దర్శకత్వం వహించారు.

రెండు బైకులు ఢీ కొని నలుగురికి గాయాలు

- ఇద్దరి పరిస్థితి ఆందోళనకరం

ముమ్మిడివరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్న ఘటనలో నలుగురు యువకులు గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. దీనికి సంబంధిచిన వివరాలివి.. మలికిపురానికి చెందిన నెల్లి వంశీ, గెద్దాడ మణికంఠ మోటారు సైకిల్‌పై కాకినాడ వెళ్లి తిరిగి వస్తుండగా అమలాపురం నుంచి మోటారు సైకిల్‌పై వెళుతున్న అయినవిల్లి మండలం యరకల్లంకకు చెందిన వడ్డి సిరాజ్, భట్నవిల్లికి చెందిన తాడి మల్లపరాజు ఎదురెదురుగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం 216 జాతీయ రహదారి బైపాస్ రోడ్డు వై-జంక్షన్‌లో శనివారం సాయంత్రం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గాయపడిన నలుగురిని అంబులెన్సులో హుటాహుటిన అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ముమ్మిడివరం ఎస్‌ఐ డి.జ్వాలాసాగర్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేశారు.

ఉమ్మడి జిల్లాల్లో తాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధి : జడ్పీ సీఈవో

పి.గన్నవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారుల ఆదేశాలతో ఉమ్మడి జిల్లాల్లో తాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామని జడ్పీ సీఈవో వీవీవీఎస్ లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండల పరిధిలోని ముంగండ తాగునీటి ప్రాజెక్టును శనివారం పరిశీలించారు. ఎంపీడీవో కేవీ ప్రసాద్, ఎంపీడీవో గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్‌లు కుసుమ చంద్రకళ, బొండాడ నాగమణి, ఆర్‌డబ్ల్యూఎస్ డిఈ పి.రవీంద్రబాబు, జేఈ జి.జయశ్రీ, నేత వెర్రియ్య ఉన్నారు.

ప్రమాదవశాత్తూ రైలు నుంచి పడి వ్యక్తి మృతి

అన్నవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం చెల్లూరుకు చెందిన కడిమి వెంకటరమణ శనివారం ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. ఈ విషయాన్ని తుని రైల్వే ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఈయన హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో లారీడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆరోగ్యం బాగోలేకపోవడంతో అన్నవరంలో బంధువుల ఇంటికి వస్తుండగా ఈ దుర్ఘటన జరిగిందని ఎస్‌ఐ చెప్పారు. ఈ మేరకు రైల్వే హెచ్‌సీ శ్యామ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

రావులపాలెం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం గౌతమి వంతెన సమీపంలో ఓ గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించినట్టు పోలీసులు తెలిపారు. 30 నుంచి 40 ఏళ్ల వయసు ఉంటుంది. ఎరుపు రంగు షర్టు, లోపల అపోలో టైర్స్ కంపెనీ టీషర్టు, నలుపు రంగు ఫ్యాంటు ధరించినట్టు చెప్పారు. బంధువులు గుర్తించేందుకు వీలుగా మృతదేహాన్ని కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు సీఐ శేఖర్‌బాబు తెలిపారు.

పశువుల అక్రమ రవాణా



గోవులను తరలిస్తున్న వ్యాన్

ప్రత్తిపాడు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు జాతీయ రహదారిపై పశువుల అక్రమ రవాణాను శనివారం పోలీసులు అడ్డుకున్నారు. తుని నుంచి రాజమండ్రికి వ్యాన్‌లో 16 ఆవులను నిబంధనలకు విరుద్ధంగా రవాణా చేస్తున్నట్టు ఎస్‌ఐ ఎస్. లక్ష్మీకాంతం చెప్పారు. ఆవులను ఏలేశ్వరంలోని గోశాలకు తరలించామన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజమహేంద్రవరంలో స్టేడియం ఏర్పాటుకు కృషి

● మంత్రి కందుల దుర్గేష్


క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్, వెనకాల క్రికెటర్ ఎంఎస్‌కే ప్రసాద్

రాజమహేంద్రవరంసిటీ, జనవరి 25(ఆంధ్రజ్యోతి):క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాజమహేంద్రవరంలో క్రికెట్ స్టేడియంను ఏర్పాటు చేసేందుకు కృషిచేస్తామని రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ, సంస్కృతిక శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాజమహేంద్రవరం పోలీస్ గ్రౌండ్స్‌లో శనివారం గ్లాడియేటర్ క్లబ్ ఆధ్వర్యంలో లెజెండ్స్ కప్ రాజమండ్రి 2025 టోర్నమెంట్‌ను ఆయన, ప్రముఖ క్రికెటర్ మాజీ చీఫ్ సెలెక్టర్ ఎంఎస్‌కే ప్రసాద్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. టోర్నమెంట్‌ను ప్రారంభించారు. మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా లెజెండ్స్ కప్ ట్రోఫీని నిర్వహించి 40 ఏళ్లపైబడిన క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారని నిర్వాహకులు బాలాజీ, జైకిషన్లను అభి నందించారు. క్రికెట్‌లో రాణిస్తున్న 10వ తరగతి విద్యార్థిని అభినందించారు. సాంస్కృతిక రాజధాని అయిన రాజమహేంద్రవరం కళలతో పా టు క్రీడలకు ప్రాధాన్యం ఇస్తారని తెలిపారు. రాజమహేంద్రవరం గడ్డపై నుంచి జాతీయ స్థా యిలో రాణించిన క్రీడాకారులు ఎంతోమంది ఉన్నారని గుర్తుచేశారు. క్రీడాకారులు రాణించేవిధంగా కూటమి ప్రభుత్వ సియం చంద్రబాబు, డిప్యూటిసియం పవన్ కళ్యాణ్, స్థానిక ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డివాసులతో కలిసి రాజమహేంద్రవరంలో పెద్దస్టేడియం ఏర్పాటు చేస్తామన్నారు. మాజీ క్రికెటర్ ఎంఎస్‌కేప్రసాద్ మాట్లాడుతూ టోర్నమెంట్ నిర్వహిస్తున్న బాలాజీ, జైకిషోన్‌ను అభినందించారు. సాధారణంగా క్రికెట్ టోర్నమెంట్ అంటే యువకులతో, బాలలతో నిర్వహిస్తారని కాని వీరు 40 ఏళ్లపైబడిన క్రీడాకారులతో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈసందర్భంగా 58 ఏళ్ల వయస్సులో ఈ టోర్నమెంట్‌లో క్రికెట్ ఆడుతున్నఅమిత్ సింగ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ, ఆర్యాపురం బ్యాంక్‌చైర్మన్ చల్లాశంకర్రావు, క్రీడాకారుడు అక్కిన శ్రీనివాస్, యేరుకొండ కిషోర్, టోర్నమెంట్ నిర్వాహకులు బాలాజీ, జై కిషన్ పాల్గొన్నారు.

మద్యం షాపుల కేటాయింపుల్లో గీత కార్మికులకు అన్యాయం

● గీత కార్మిక సొసైటీల నేతలు

రాజమహేంద్రవరంసిటీ, జనవరి 25(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో మద్యం షాపులు కేటాయింపుల్లో గీత కార్మికులకు అన్యాయం జరిగిందని కల్లుగీత సహకార సంఘం గ్రూప్ వన్ అధ్యక్షుడు మట్టా శేషు, కార్యదర్శి మట్టా శ్రీనివాస్‌లు అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మద్యంషాపుల కేటాయింపులో కూటమి ప్రభుత్వం నేతలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీకి కట్టుబడాలన్నారు. ఎన్నికల సమయంలో కల్లుగీత కార్మిక సహకార సంఘాలకు 20శాతం షాపులు కేటాయిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక దానిని కుదించి 10శాతం అమలుచేశారని అదికూడా వారి పార్టీలో గీత కులాలకు ఇచ్చి గీతకార్మిక సంఘాలకు అన్యాయం చేస్తున్నారన్నారు. గతంలో గీత సహకార సంఘాలకు ఉన్న పన్నులు రూ. 60వేలను రద్దుచేసి ఆదుకున్న సీఎం చంద్రబాబు ఇప్పుడు కొంతమంది మాటలు విని గీత సంఘాలకు అన్యాయం చేయడం తగదన్నారు. గీత కులాలో అధికార పార్టీ వారికి మాత్రమే షాపులు కేటాయింపులు జరిగాయని గీత సంఘాలలోని కార్మికులు పేదవాళ్ళుగానే వున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

దేశాభివృద్ధికి తోడ్పడదాం

● జిల్లా బీజేపీ అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర


పిక్కినాగేంద్రను సత్కరిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : భారతదేశ ప్రధాన మంత్రిగా నరేంద్రమోదీ మూడు పర్యాయాలు ఎన్నిక కావడం ద్వారా దేశ ప్రజలు నరేంద్రమోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని మరిత కాలం ప్రధానిగా మోదీని బలపరచేందుకు ప్రతి బీజేపీ కార్యకర్త కృషి చేయాలని జిల్లా బీజేపీ అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అన్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన తరువాత మొట్టమొదటిసారిగా ఆయన శనివారం అనపర్తి మండలం రామవరంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని కలుసుకుని తన అభ్యర్థిత్వాన్ని బలపరచిని రామకృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందన్నారు. నాగేంద్ర అధ్యక్షుడిగా ఎన్నిక కావడంతో జిల్లాలో బీజేపీ మరింత బలపడుతుందని అన్నారు. అనంతరం నాగేంద్రను ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డిలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శివరామకృష్ణంరాజు, మేడపాటి హరినారాయణ రెడ్డి, చిట్టిబాబు, కర్రి బులిరెడ్డి, టీడీపీ నాయకులు సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, ఆళ్ల గోవిందు, జుత్తు కృష్ణ, జనసేన నాయకులు రావాడ నాగు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి పునాది ఓటు హక్కు

● ఓటరు దినోత్సవంలో కలెక్టర్ ప్రశాంతి



ఓటరు దినోత్సవంలో సీనియర్ ఓటర్లను సత్కరించిన కలెక్టర్ ప్రశాంతి



కడియంలో ఓట్ అనే ఆకృతిలో విద్యార్థులు



అనపర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దార్, ఎమ్‌పీడీవో, దవళేశ్వరంలో సీనియర్ ఓటర్లను సత్కరిస్తున్న ఈఆర్‌వో

రాజమహేంద్రవరంసిటీ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): భారతదేశంలో ప్రజాస్వామ్యానికి పునాది ఓటు హక్కు అని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. రాజమహేంద్రవరంలో శనివారం జరిగిన ఓటరు దినోత్సవ వేడుకకు కలెక్టర్ ప్రశాంతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత వైజంక్షన్ నుంచి నిర్వహించిన ఓటరు దినోత్సవ ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ కంబాలచెరువు, దేవీచౌక్, గోకవరం బస్టాండ్ ,మునిసిపల్ కార్యాలయం రోడ్డుగుండా ఆనంకళాకేంద్రానికి చేరుకుది. ఈ ర్యాలీలో కలెక్టర్ ప్రశాంతి, జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్, నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్‌లు పాల్గొన్నారు. అనంతరం కళాకేంద్రంలో జాయింట్ కలెక్టర్ చిన్నరాముడుతో కలిసి సభను ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ప్రజలందరూ ప్రజాస్వామ్య విలువలు కాపా డేవిధంగా ఓటు హక్కుని వినియోగించుకోవాలన్నారు. ఎన్నికలు ఐదేళ్లకు ఒకసారి వస్తాయని ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా ప్రతిఒక్కరూఓటు హక్కును వినియోగించుకుని నాయకులను ఎన్నుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు తప్పక ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు.ఓటు హక్కు కలిగిన యువత 50శాతం మాత్రమే ఓటు హక్కునివినియోగించుకుంటున్నారని నూరుశాతం వినియోగించుకునేలా చైతన్యం కావాలన్నారు. దేశ భవిష్యత్తును నిర్ణయించేది ఓటేనని అన్నారు. ఓటు హక్కు ప్రాధాన్యతను తెలియజేసేందుకు పౌరుల బాధ్యతలను గుర్తుచేసి వారిలో స్ఫూర్తిని నింపేందుకు ప్రతి ఏడాది జనవరి 25న ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జేసీ న్నరాముడు మాట్లాడుతూ గతంలో మండల స్థాయి అధికారులు ఓటు హక్కులు నమోదు చేసేవారని, ప్రస్తుతం టెక్నాలజీ పెరిగి సెల్‌ఫోనులో, ఆన్‌లైన్‌లో మండల తహసీల్దార్ కార్యాలయంలో ఓటుహక్కు నమోదు చేసుకునే విధంగా ఎన్నికల కమిషన్ అవకాశాలు కల్పించిందని తెలిపారు. మంచి నాయకులను ఎన్నుకోవడానికి ఓటు హక్కు దోహదపడుతుందన్నారు. కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ నిజాయితీ ఉన్న నాయకులను ఎన్నుకునే హక్కు ఓటు కల్పించిందన్నారు. తొలుత విద్యార్థినిలతో సంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం సీనియర్ ఓటర్లను, ఓటు హక్కుకలిగిన ట్రాన్స్‌జెండర్లను సత్కరించారు. వ్యాసరచన, డిబేట్‌పోటీలలో విజేతలకు సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణనాయక్, జిల్లా విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు, డీఆర్‌డీఏ ఎస్వీవీఎస్ మూర్తి డీపీఆర్‌వో కాశయ్య, డీఐ దిలిప్‌కుమార్, స్పోర్ట్స్ అధికారి డీఎం ఎంఎం శేషగిరి, నియోజకవర్గ ఎలక్టోరల్ అధికారులు, జిల్లా అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు, సీనియర్ సిటిజన్లు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంరూరల్: ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు కీలకమైందని రూరల్‌నియోజకర్గ ఈఆర్‌వో శరళా వందనం పేర్కొన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా రూరల్ మండలం ధవళేశ్వరంలో బాలికల పాఠశాలలో కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాలు దాటిన ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలన్నారు. పాఠశాల విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రతిభ కనపరచిన విద్యార్థినులకు ప్రధమ, ద్వితీయ, తతీయ బహుమతులతోపాటు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం సీనియర్ ఓటర్లను సత్కరించారు. సీనియర్ ఓటర్లను సత్కరించారు. కార్యక్రమంలో రూరల్ తహసీల్దార్ కుమార్, గ్రామ కార్యదర్శి వెంకట్రావు, డిప్యూటీ తహసీల్దార్ చైతన్య, ఎంఆర్ఐ ప్రసాద్, పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయురాలు ఐవీకేవీ ప్రసన్నకుమారి వీఆర్వోలు రవి, మీరా, బీఎల్‌వోలు, అధికారులు పాల్గొన్నారు.

కడియం: జాతీయ ఓటర్ల దినోత్సవం కడియం, మాధవరాయుడుపాలెం, వీరవరం వేమగిరి, గ్రామాల్లో ఘనంగా జరిగింది. ఆయా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. ఉన్నత పాఠశాల విద్యార్థులు, రెవెన్యూ, పంచాయతీ ఉద్యోగులు ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం జరిగింది. ఓటు వజ్రాయుధం అన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు ఓటే మూలం అన్నారు. ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. సీనియర్ ఓటర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మొగుబంటి ప్రసాద్, సర్పంచ్ మోసిగంటి సత్యవతి, ఉపసర్పంచ్ వెలుగుబంటి నాని, పాఠశాల హెచ్ఎం టిసత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దారు మహాలక్ష్మి, ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మాధవరాయుడుపాలెంలో జరిగిన జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అన్నందేవుల చంటి మాట్లాడారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సీనియర్ ఓటర్లను సత్కరించారు. వేమగిరిలో జరిగిన జాతీయ ఓటర్ల దినోత్సవంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ నాయకులు చెల్లుబోయిన శ్రీనివాస్ మాట్లాడారు. గుత్తుల కృష్ణ, యనమదల రాజు, పితాని రామకృష్ణ, దంగేటి సత్తిబాబు పాల్గొన్నారు. వీరవరంలో ఎంపీపీ పాఠశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా జరిగింది. సీనియర్ ఓటర్లను సత్కరించారు. విద్యార్థులకు పెన్నులు, బుక్స్ పంపిణీ చేసారు.

రంగంపేట: ప్రజాస్వామ్య వ్యవస్థలో వజ్రాయుధంలాంటి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ కోసు అనసూయ పిలుపునిచ్చారు.శనివారం రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జాతీయ ఓటరు దినోత్సవ సందర్భంగా ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మీ అధ్యక్షతన నిర్వహించిన సభకు ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. 17 గ్రామాల్లో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఆయా గ్రామా రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, ముగ్గుల పోటీలు నిర్వహించి సర్టిఫికెట్లు ప్రధానం చేసామన్నారు. స్థానిక సీనియర్ సిటిజన్స్ పిచ్చికల అచ్యుతరామయ్య, పోతుల సత్యనారాయణలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బలిరెడ్డి దుర్గారావు, కూటమి నాయకులు ఉండవిల్లి గిరిబాబు,పోతుల చిన్నికాపు,పోతుల వీర సుందరరావు, అంచూరి సహదేవుడు,గ్రామకార్యదర్శి శ్రీరామమూర్తి. తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

అనపర్తి: ఓటు హక్కును పొందడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ అనిల్‌కుమార్ అన్నారు. శనివారం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా అనపర్తిలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎపింక చేసిన పలువురు సీనియర్ సిటిజన్లను సత్కరించారు. అదే విదంగా ఓటరు దినోత్సవంలో భాగంగా వివిద పాఠశాలల్లో నిర్వహించిన పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎమ్‌పీడీవో రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కుతుకులూరు ఉన్నత పాఠశాలలో జరిగిన జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సర్పంచ్ గొల్లు హేమ తులసి ముగ్గుల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది. మండల పరిషత్ సిబ్బంది, విద్యార్థులు, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

స్వచ్ఛగ్రామాలతో అభివృద్ధి సాధ్యం

కడియం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): జేగురుపాడులో శనివారం గ్రామ సర్పంచ్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ దివాస్ అనే నినాదంతో వాడవాడలా గ్రామంలో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ స్టాలిన్ మాట్లాడుతూ గ్రామంలో ప్రతీ శనివారం పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అన్నారు.

విద్యార్థులు, డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) :జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు -2025లో భాగంగా శనివారం బొమ్మూరు శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో విద్యార్థులు, డ్రైవర్లు, హెల్పర్లు, సూపర్‌వైజర్లు, మేనేజ్‌మెంట్‌కు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. స్కూలు, కాలేజీకి వచ్చే సిబ్బందిని హెల్మెట్ ధరించి వచ్చేలా నిబంధన విధించాలని, ప్రతిఏటా డిసెంబరు, జనవరి నెలలో డ్రైవర్లకు, ఇతర సిబ్బందికి ఆరోగ్యపరీక్షలు జరపాలని, ప్రతి విద్యాసంస్థకు ఒక సైకలాజికల్ కౌన్సిలర్‌ను నియమించుకోవాలని సూచనలు చేశారు. జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్ సూచనలమేరకు ఎంవీఐ సీహెచ్ సంపత్‌కుమార్, ఎం.రవికుమార్, జి.రాంనారయన్, కె.చైతన్య సుమ, జి.రాధికా దేవి, పీవీవీ సాయికుమార్, రోడ్డు భద్రతా డాక్టర్ పి.మాధురి దేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభ్యసన ఫలితాలు వచ్చేలా కృషిచేయాలి

● జిల్లా సమగ్రశిక్ష ఏఎంవో గౌరీశంకరరావు



దివాన్‌చెరువు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థికి అభ్యసన ఫలితాలు వచ్చేలా కృషిచేయాలని జిల్లా సమగ్రశిక్ష మోనటరింగ్ అధికారి డీ.గౌరీశంకరరావు అన్నారు. కొండగుంటూరులో ఆరు రోజులుగా ఇస్తున్న ఎఫ్ఎల్ఎన్ 8వ స్పెల్ శిక్షణ శనివారంతో ముగిసింది. డైట్ లెక్చరర్ సుజాతరత్నం, కేఆర్‌పీలు గౌతమ్‌కృష్ణ, గంగాధరరావు, 24 మంది డీఆర్‌పీలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు

గోకవరం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని వీరలింకపల్లి వద్ద శనివారం రాత్రి చోటు చేసుకొంది. దేవీపట్నం మండలం మడిపల్లి గ్రామానికి చెందిన నగేష్, రాంపడు అనే ఇద్దరు యువకులు గోకవరం నుంచి రాజమహేంద్రవరం వైపు మోటారు సైకిల్‌పై వెళుతుండగా వీరలింకపల్లి జంక్షన్‌వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. దీంతో ఎస్ఐ పవన్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వీరిలో ఒకరి పర్ధితి విషమంగా ఉన్నట్లు తెలియవచ్చింది. జరిగిన ఘటనకు సంబంధించి పూర్తి వివరాలను పోలీసులు ఇంకా వెల్లడించలేదు.



బొబ్బిల్లంక జడ్పీ హైస్కూల్‌లో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం


బిక్కవోలులో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



గోకవరంలో ర్యాలీ చేస్తున్న రెవెన్యూ అధికారులు, విద్యార్థులు

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

సీతానగరం, జనవరి 25, (ఆంధ్రజ్యోతి): సీతానగరం డిగ్రీ కళాశాల, బొబ్బిల్లంక జడ్పీ హైస్కూల్, ప్రభుత్వ హైస్కూల్, వెదుళ్ళపల్లి జిల్లా పరిషత్ హైస్కూళ్లలో ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిట్టిబాబు మాట్లాడుతూ 18 సం.లు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బిక్కవోలు: స్థానిక జడ్పీ హైస్కూల్లో శనివారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రంగవల్లుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అం దజేశారు. అనంతరం విద్యార్థులను మానవహారంగా ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేయించారు. సీనియర్ ఓటర్లు అప్పారావు, సన్యాసిరావును సత్కరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సత్యకృష్ణ, హెచ్ఎం ప్రభాకరరావు, వీఆర్వోలు అశోక్, పోతురాజు, ఉపాధ్యాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఓటు.. వజ్రాయుధం

రాజానగరం: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని గాయత్రీ విద్యాసంస్థల కరస్పాండెంట్ వీవీఎస్ఎన్ మూర్తి పేర్కొన్నారు. కానవరం లోని గాయత్రీ విద్యాసంస్థల ఆధ్వర్యంలో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఆంగ్ల అక్షరాలతో కూడిన ఓటు అనే పదంలో ఆశీనులయ్యారు.

గైట్ ప్రాంగణంలో...

జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని గైట్ అటానమస్, ఇంజనీరింగ్ కళాశాలల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టీ.జయానంద కుమార్, డీన్లు బీ.శ్రీనివాసరాజు, గౌరీ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు బి.శ్రీనివాస్, అవినాష్, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికీ ఓటు హక్కు అవసరం

గోకవరం: సమాజంలో ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు అవసరమని తహశీల్దారు ఎంవీ సాయిప్రసాద్ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురష్కరించుకొని గోకవరంలో శనివారం రెవున్యూ అధికారులు, సిబ్బంది, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు కలిసి ప్రధాన రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు.

అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి రెవెన్యూ కార్యాలయం వరకు ర్యాలీని కొనసాగించారు.

వంగలపూడిలో ఉచిత హోమియో వైద్యశిబిరం

సీతానగరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): వంగలపూడిలోని పంచాయతీ కార్యాలయం వద్ద అంతర్జాతీయ అహ్మదీయ ముస్లిం కమ్యూనిటి ఆధ్వర్యంలో శనివారం ఉచిత హోమియో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఇందులో డా.షేక్ అహ్మద్ పాల్గొని రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేసారు. జిల్లా ఇన్‌చార్జి మహ్మద్ సిరాజ్ , జిల్లా సభ్యులు నజీర్‌గోరి , జావిద్ మసీదు అధ్యక్షులు షేక్ ఖాసి ఫారూఖ్, మహ్మద్ అక్బర్ ,షేక్ అహ్మద్ ఆలీ, తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో నిండు గర్భిణి ప్రసవం

పండంటి మగబిడ్డకు జన్మనిచ్చిన కల్యాణి


మగబిడ్డకు జన్మనిచ్చిన సూర్యకల్యాణి

గోకవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రసవ వేదనతో బాధపడుతున్న నిండు గర్భిణీని 108 వాహనంలో ఆసుపత్రికి తరలిస్తుం డగా మార్గమధ్యలో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈ సంఘటన శనివారం మల్లవరంలో చోటుచేసు కుంది. గ్రామానికి చెందిన కే.సూర్యకల్యాణి అనే నిండు గర్భిణీకి నెలలు పూర్తి కావడంతో పురుటినొప్పులు ప్రారంభమయ్యాయి. దీంతో ఆమెను అంబులెన్స్‌లో మల్లవరం నుంచి గోకవరం ప్రభుత్వాసుపత్రికి తరలి స్తుండగా ప్రసవించింది. ఆ సమయంలో సిబ్బంది సురేష్, రమణ సపర్యలు చేశారు. తల్లీబిడ్డ క్షేమంగానే ఉన్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

పశువైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు రాము


శిబిరాన్ని ప్రారంభిస్తున్న రాము

బిక్కవోలు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉచితంగా ఏర్పాటు చేస్తున్న పశు వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు పడాల రాము సూచించారు. కొమరిపాలెంలో శనివారం పశువైద్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరంలో 70 పశువులకు, 30 దూడలకు వైద్య సేవలు అందించారు. 30 మంది రైతులకు మందులు అందజేసారు. కార్యక్రమంలో సర్పంచ్ వాసంశెట్టి రవికుమార్, మాజీ ఉపసర్పంచ్ ద్వారంపూడి వెంకటరెడ్డి, సత్తి అమ్మిరెడ్డి, అనపర్తి ఏడీఏ డాక్టర్ వై. శ్రీనివాసరావు, మండల పశువైద్యులు ప్రియదర్శిని, రవికుమార్, వీర్రాజు, వెంకట్రావు, ప్రణీత్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





మిరియాలకు పద్మశ్రీ
బుర్రకథకు ప్రాణం పెట్టిన అప్పారావు.. ఇటీవల మరణం.. దశదినకర్మ రోజున పద్మశ్రీ ప్రకటన.. రావులపాలెంలో ఇటు విషాదం.. అటు ఆనందం 9

కూటమి ప్రభుత్వం వచ్చింది.. అభివృద్ధికి బాటలు వేస్తోంది.. ఒక్కొక్కటి మార్చుకుంటూ వస్తోంది.. ప్రస్తుతం గుంతల రోడ్లు మారాయి.. ఎక్కడికక్కడ రోడ్లపై సాఫీగా ప్రయాణం సాగిపోతోంది.. వాట్ నెక్స్ట్ అందరూ అనుకుంటుండగానే.. ప్రభుత్వం మరో కొత్త సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టింది.. అదే హాస్టల్స్.. వసతి గృహాలను వహ్వా అనేలా తీర్చిదిద్దేలా నిధులు విడుదల చేస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 55 ఎస్సీ వసతి గృహాల అభివృద్ధికి రూ.8.50 కోట్లు నిధులు విడుదల చేయడం గమనార్హం.



ఏలేశ్వరంలో ఎస్సీ హాస్టల్

వసతి..మారెను గతి!

- ఎస్సీ హాస్టళ్లకు మంచిరోజులు
- 55 హాస్టళ్లకు రూ.8.50 కోట్లు
- ఉమ్మడి జిల్లాకు కేటాయింపు
- కూటమి సర్కారు నిర్ణయం
- హాస్టళ్ల మరమ్మతులపై దృష్టి
- టెండర్లు పిలిచిన అధికారులు
- వచ్చే నెల నుంచి పనులు
- బీసీ హాస్టళ్లకు రూ.70 లక్షలు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ హాస్టళ్లకు మంచిరోజులు వచ్చాయి. నిన్నటి వరకూ ఎప్పుడు కూలిపోతాయో తెలియని పైకప్పులు.. గతుకులమయంగా మారిన గచ్చులు.. వేలాడే తలుపులు.. ఏమాత్రం రక్షణలేని కిటికీలు.. రకరకాల విషసర్పాలకు ఆలవాలంగా మరుగుదొడ్లు.. వెలగని లైట్లు.. పని చేయని కుళాయిలు.. ఇదీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సాంఘిక సంక్షేమ వసతి గృహాల దుస్థితి. గడచిన ఐదేళ్లుగా వీటి బాగోగులను గత వైసీపీ ప్రభుత్వం గాలికొది లేసింది. బటన్ నొక్కుడు మినహా విద్యార్థుల బాధలను కనీసం పట్టించుకోలేదు. దీంతో ఐదేళ్ల నుంచీ అనేక అవస్థల మధ్య విద్యార్థులు పడ్డ నరకయాతన అంతా ఇంతా కాదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వీటిని మార్చబోతోంది. ఐదేళ్లపాటు బాగోగులకు నోచుకోని వసతి గృహాలకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలని నిర్ణయించింది. విద్యార్థులు ఇబ్బంది పడకుండా ఏకంగా రూ.8.50 కోట్లతో మరమ్మతులకు ఆమోదం తెలిపింది. దీంతో పనులు చేయడానికి వీలుగా అధికారులు ఎట్టకేలకు టెండర్లు పిలిచారు. వచ్చే నెలలో ఇవన్నీ మొదలు కానున్నాయి. అటు ఉమ్మడి జిల్లాలో రూ.70 లక్షలతో 16 బీసీ హాస్టళ్ల మరమ్మతులకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

నిధుల కేటాయింపులిలా..

ఎస్సీ, బీసీ హాస్టళ్లపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. వసతిగృహాల్లో సమస్యలను పరిష్కరించాలని నిర్ణయించింది. అధికారులు ఇటీవల ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపడంతో రూ.8.50 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో త్వరలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 55 ఎస్సీ బాల బాలికల వసతి గృహాలకు పూర్తిస్థాయి మరమ్మతులు చేయనున్నారు. ఇందులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 22 ఎస్సీ వసతి గృహాలకు రూ.4.93 కోట్లతో రిపేర్లు చేయనున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 20 వసతి గృహాలకు రూ.3.83 కోట్లు, కాకినాడ జిల్లాలో 13 హాస్టళ్లకు రూ.1.23 కోట్లతో మరమ్మతులకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఒక్కో వసతిగృహానికి అక్కడ అవసరాలను బట్టి రూ.10 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు నిధులు మంజూరు చేసింది. ప్రధానంగా కోనసీమ జిల్లాలో కె.గంగవరం హాస్టల్ మరమ్మతులకు రూ.8.80లక్షలు, ఉప్పలగుప్తం రూ.14.60 లక్షలు, ముమ్మిడివరం రూ.17.60 లక్షలు, రావులపాలెం రూ.17.30 లక్షలు, అంబాజీపేట రూ.22.40 లక్షలు, ఆలమూరు రూ.25లక్షలు, రామచంద్రపురం రూ.35.30 లక్షలు. రాజమహేంద్రవరం-1 రూ.17.20 లక్షలు, ధవళేశ్వరం రూ.24.96 లక్షలు, పెద్దాపురం రూ.6.15లక్షలు. కాకినాడ అర్బన్‌లో రూ.19.50 లక్షల చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కాకినాడ జిల్లాలో తొమ్మిది బీసీ బాలబాలిక వసతిగృహాల మరమ్మతులకు రూ.38లక్షలు, తూర్పుగోదావరి జిల్లాలో 8 బీసీ హాస్టళ్ల మరమ్మతులకు రూ.29.50 లక్షల చొప్పున ప్రతిపాదనలు ప్రభుత్వానికి వెళ్లాయి. వీటికి కూడా త్వరలో టెండర్లు పిలవనున్నారు.

ఏం చేస్తారంటే..

పైకప్పుల మరమ్మతు చేపట్టి వసతిగృహాల్లో ఇకపై శ్లాబ్‌లకు ఇబ్బంది లేకుండా సురక్షితంగా ఉండేలా తీర్చిదిద్దనున్నారు. అలాగే గచ్చులు,తలుపులు ,కిటికీలకు మరమ్మతులు చేయనున్నారు. విద్యుత్, తాగునీటి సమస్యలకు పరిష్కారం చూపుతారు. ఎక్కడికక్కడ కొత్త ట్యాంకుల నిర్మాణం, కుళాయిల ఏర్పాటు, కొత్త వైరింగ్ చేయనున్నారు. ఈ పనులు ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఈడబ్ల్యూఐడీసీ), ఆర్‌డబ్ల్యూ ఎస్,పీఆర్ ఇంజనీరింగ్ విభాగాల ఆధ్వర్యంలో జరగనున్నాయి. ఇటీవల ఈ విభాగాలు టెండర్లు పిలిచాయి. వచ్చేనెల రెండో వారం నుంచి పనులు ప్రారంభంకానున్నాయి.



సీఎస్ విజయానంద్ నుంచి అవార్డు అందుకుంటున్న ఆర్‌డీవో రాణిసుస్మిత

కొవ్వూరు ఆర్‌డీవో రాణి సుస్మితకు అవార్డు

కొవ్వూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు నియోజకవర్గంలో 98 శాతం పైగా యువ ఓటర్ల నమోదు చేయడంతో కొవ్వూరు ఆర్డీవో డా. రాణి సుస్మిత ఉత్తమ ఎలక్ట్రోరల్ అధికారిగా అవార్డు అందుకున్నారు. రాష్ట్రంలో ఎలక్ట్రోరల్ జాబితా రూపకల్పణలో ఉత్తమ పనితీరు కనబర్చిన 11 మంది రెవెన్యూ అధికారులను అవార్డుకు ఎంపిక చేశారు. కొవ్వూరు డివిజన్ పరిధిలో 18 నుంచి 19 ఏళ్ల మధ్య వయస్సు యువ ఓటర్ల నమోదులో 98 శాతం పైగా నమోదు చేశారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ ఎలక్ట్రోరల్ అధికారిగా కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, ఏఈఆర్వోగా కొవ్వూరు తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్‌లకు సీఎస్ విజయానంద్ అవార్డులను అందజేశారు. కలెక్టర్ పి.ప్రశాంతి, జేసీ ఎస్.చిన్నరాముడు అభినందించారు.

విమానాశ్రయ టెర్మినల్ పరిశీలించిన మంత్రి, ఎంపీ 9



లే..డౌట్!

ఇంకనూ తేలని భాస్కర్ నగర్ అక్రమాల డొంక

- గతంలో నెల రోజులు సర్వే
- భాస్కర్‌నగర్‌లో 278 ప్లాట్లు
- గత సర్వేలో 103 పరిశీలన
- 155 ప్లాట్లు అన్యాక్రాంతం?
- స్వాధీనానికి కలెక్టర్ మొగ్గు
- త్వరలో మళ్లీ సర్వేకు ఆదేశం
- భూ కుంభకోణంపై దృష్టి
- తవ్వేకొద్దీ అక్రమాలు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

లెక్కతేలుస్తాం..అక్రమాల పనిపడతాం అంటూ అధికారులు రంగంలోకి దిగారు.. సుమారు నెలరోజుల పాటు సర్వే చేసి ఏమీ తేల్చ లేకపోయారు..ఇదీ కోట్లాది రూపాయల విలువైన స్థలాలున్న రాజమండ్రి పబ్లిక్ సర్వీస్ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ స్థలాలు (భాస్కర్ నగర్ లేవుట్)లో పరిస్థితి..ఈ లేఅవుట్‌లో మొత్తం 278 పాట్లు ఉన్నాయి.అధికారులు నెల రోజులు పాటుపడి 103 ప్లాట్లను వెరిఫై చేశారు. సుమారు 155 ప్లాట్లు అన్యాక్రాంతమైనట్టు ప్రాథమిక అంచనా వేసిన సంగతి తెలిసిందే. చట్టప్రకారం అర్హులకు న్యాయం చేయడానికి, రికార్డులు లేనివాటిని స్వాధీనం చేసుకోవడానికి నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. ఈ మేరకు ప్రభుత్వ లాయర్ అభిప్రాయం కోరుతూ కలెక్టర్ లేఖ కూడా రాశారు.

'ఆంధ్రజ్యోతి' కథనంతో కదలిక

భాస్కర్‌నగర్ లేఅవుట్‌లో అక్రమాలపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై కలెక్టర్ ప్రశాంతి స్పందించి అధికార యంత్రాంగాన్ని సమాయత్తం చేశారు. అధికారులతో కమిటీ వేసి వివరాలు సేకరించి తర్వాత మొత్తం సర్వే చేయాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గత నెలలో జిల్లా కోఆపరేటివ్, రెవెన్యూ అధికారుల సమక్షంలో మూడు రోజుల పాటు సర్వే చేసి సుమారు 155 ప్లాట్ల వివరాలు తేల్చారు. ఈలోపు సర్వేయర్లకు వేరే పనులు ఉండడంతో సర్వే నిలిచిపోయింది. త్వరలో మరింత మంది సర్వేయర్లను ఏర్పాటు చేసి మొత్తం ప్లాట్ల వివరాలన్నీ సేకరిస్తామని అధికారులు చెబుతున్నారు. కానీ ఇదే వేడిలో పూర్తి చేసి అక్రమాల నిగ్గు తేల్చితే కోట్లాది రూపాయల కుంభకోణం బయటపడుతుంది. రాజకీయనేతలు, రౌడీషీటర్ల అండతోనే అక్రమాలు పెచ్చుమీరిన సంగతి తెలిసిందే. తాత్సారం జరిగే కొద్దీ అక్రమార్కులు రకరకాల ఎత్తుగడలు వేసే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. సర్వే పూర్తయితే ఏళ్ల తరబడి ఉన్న సమస్యకు పరిష్కారం లభిస్తోంది.

అయ్యో పాపం అధికారులు

గతం లో అక్రమాలకు పాల్పడిన వారంతా బాగా సంపాదించుకుని పెత్తందార్లుగా మారిపోయారు.వారి ఊబిలో పడిన అధికారులు కోర్టు చుట్టూ తిరుగుతున్నారు.రెండు ప్లాట్ల విషయంలో కోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయకుండా ఇష్టానుసారం వ్యవహరించిన సహకార శాఖపై కోర్టు ధిక్కార ఆదేశాలు రావడంతో వారంతా దాని నుంచి బయట పడడానికి తంటాలు పడుతున్నారు.కోర్టు చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటికే ఇక్కడి పరిస్థితిపై కమిటీ వేసి ఒక నివేదిక కూడా రప్పించుకున్న తర్వాతే సర్వేకు ఆదేశించారు.ఈ మేరకు వాస్తవంగా అర్హులకు న్యాయం చేయడంతో పాటు రికార్డులులేనివి, అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లిన వాటిన ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి.



గీత మార్చెను!

హామీని నిలబెట్టుకున్న కూటమి

- 10 శాతం మద్యం దుకాణాలు
- 13 మండలాలకు కేటాయింపు
- మండలంలో రూ.32.5 లక్షలు
- కార్పొరేషన్‌లో రూ.42.5 లక్షలు
- శెట్టిబలిజలకు 11 షాపులు
- గౌడ కులస్తులకు ఒకటి
- గౌడ్ కులస్తులకు మరొకటి
- ఆయా వర్గీయుల ఆనందం
- 20 శాతం ఇవ్వాలని డిమాండ్

రాజమహేంద్రవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా గీత కులాలకు మద్యం షాపులు కేటాయించింది. 10 శాతం షాపులను ఇచ్చింది.ఆయా ప్రాంతాల్లో ఉన్న గీత కులాల్లోని ఉపకులాల వారీ కేటాయింపులు జరిగాయి. చరిత్రలో ఏనాడూ లేని విధంగా సగం రాయతీతో గీత కులాలకు మద్యం షాపులు కేటాయించడం పట్ల ఆయా వర్గీయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టరేట్‌లో శనివారం కలెక్టర్ పి.ప్రశాంతి, జేసీ ఎస్.చిన్నరాముడు ఆధ్వర్యంలో మండలాల వారీ లాటరీ తీసి, షాపులు కేటాయించినట్టు జిల్లా ఎక్సయిజ్ సూపరింటెండెంట్ లావణ్య తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 13 మండలాల్లో ఈ దుకాణాలు కేటాయించారు. రాజమహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్ పరిధి, బిక్కవోలు, చాగల్లు, దేవరపల్లి, గోపాలపురం, కడియం, కోరుకొండ, పెరవలి, రంగంపేట, సీతానగరం, తాళ్లపూడి మండలాల పరిధిలో ఒక్కొక్క మద్యం దుకాణం వంతున గీత కులాల్లో ఒక కులమైన శెట్టిబలిజలకు కేటాయించారు. అనపర్తిలో గౌడ్ కులానికి 1, నిడదవోలు రూరల్‌లో గౌడ కులానికి 1 కేటాయించారు. మండలాల్లో దుకాణానికి రూ. 32.5 లక్షలు,రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలో 42.5 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది.ఇతరులు గతంలో వీటికి రెట్టింపు ఫీజు చెల్లించారు. అప్లికేషన్ ఫీజు రూ.2 లక్షలు చెల్లించాలి. ప్రభుత్వం దుకాణాలను గెజిట్ రూపంలో ప్రకటించనుంది.ఈ ప్రకటన వచ్చిన వెంటనే దుకాణాలు మొదలు పెట్టుకోవచ్చని అధికారులు తెలిపారు.రాజమహేంద్రవరం గౌడ-శెట్టిబలిజ సంఘం గౌరవాధ్యక్షుడు బుడ్డిగ శ్రీనివాస్ ప్రభుత్వ నిర్ణయంపై అభ్యంతరం తెలిపారు. ఎన్నికల ముందు కూటమి 20 శాతం షాపులు గీత కులాలకు కేటాయిస్తానని,ఇవాళ 10 శాతమే కేటాయించిందన్నారు.ఈ షాపులను వ్యక్తులకు కాకుండా గీత కార్మికుల సొసైటీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు.



కోటికేశవరం దళితవాడలో సహపంక్తి భోజనాలు చేస్తున్న ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రుడా చైర్మన్‌బొడ్డు వెంకటరమణ చౌదరి

విందు.. పసందు

కోటికేశవరంలో నాయకుల సహపంక్తి భోజనం

కోరుకొండ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : భారత ప్రధాని నరేంద్రమోదీ సంవిధాన్ గౌరవ దివాస్ కార్యక్రమంలో భాగంగా శనివారం రాజానగరం నియోజకవర్గం కోరుకొండ మండలం కోటికేశవరం దళితవాడలో ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి పర్యటించారు.ఈ సందర్భంగా ఎంపీ దళితులతో సమావేశమై పలు విషయాలు చర్చించారు.అనంతరం వారితో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.ఎంపీ మాట్లాడుతూ నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవంగా ప్రధాని మోదీ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకం అన్నారు. భారత రాజ్యాంగం 75వ వార్షికోత్సవం సందర్భంగా హమరా సంవిధాన్...హమరా స్వాభిమాన్ పేరుతో దేశ వ్యాప్తంగా ఉత్సవాలు జరుపుతున్నట్టు ఎంపీ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఏపీఆర్ చౌదరి, టీడీపీ నాయకులు తనకాల నాగేశ్వరరావు, గ్రామ సర్పంచ్ మూడే సింధు దివ్య, అడపా వీరబాబు, పలువురు జనసైనికులు,బీజేపీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు గణతంత్ర దినోత్సవం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్ గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముస్తాబైంది.ఈ మేరకు జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. కలెక్టర్ ప్రశాంతి ఆదేశాలతో జిల్లాలో 17 శాఖలకు సంబంధించిన అభివృద్ధి శకటాలను ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఏడు స్టాల్స్ సిద్ధం చేశారు. వీటిని గణతంత్ర దినోత్సవంలో ప్రదర్శించనున్నారు. ఏర్పాట్లను జేసీ ఎస్.చిన్నరాముడు,ఆర్‌డీవో కృష్ణ నాయక్ ఇతర అధికారులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. 76వ గణతంత్ర దినోత్సవంలో జాతీయ స్ఫూర్తి, రాష్ట్ర ,కేంద్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న సంక్షేమ ,అభివృద్ధి పథకాల కార్యక్రమాలతో కూడిన శకటాలు ప్రదర్శిస్తామన్నారు. శకటాల్లో డీఆర్‌డీఏ, ముఖ్యప్రణాళిక , హౌసింగ్, పరిశ్రమలు అండ్ వాణిజ్యవిభాగం, పర్యాటక, నైపుణ్యాభివృద్ధి, ఉన్నత విద్య, ఆరోగ్యం వైద్యం కుటుంబ సంక్షేమం, మహిళా శిశు సంక్షేమం, జలవనరులు, నీటిపారుదల ,వ్యవసాయం, మత్స్యశాఖ, మునిసిపల్‌శాఖ , అగ్రికల్చర్, జాతీయ ఓటరు దినోత్సవ ప్రచార శకటాలు ప్రదర్శిస్తారు. అదేవిధంగా హోమ్‌సెన్సార్ యుటిలైజేషన్ ఏడు స్టాల్స్ ఏర్పాటు చేసినట్టు జేసీ తెలిపారు.



గణతంత్ర దినోత్సవానికి ముస్తాబైన ఆర్ట్స్ కళాశాల ప్రాంగణం



న్యూ ఢిల్లీకి కె.సావరం సర్పంచ్



ఉండ్రాజవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : రిపబ్లిక్ డే సందర్భంగా న్యూఢిల్లీలో ఆదివారం జరిగే కార్యక్రమానికి ఆహ్వానం అందినట్టు మండలంలోని కె.సావరం సర్పంచ్ నార్ని రామకృష్ణ శనివారం విలేకరులకు తెలిపారు. సర్పంచ్‌ల నుంచి పరేడ్‌కు హాజరయ్యేందుకు తూర్పుగోదావరి జిల్లా నుంచి తనకు అరుదైన అవకాశం వచ్చిందన్నారు. ఈ అవకాశం కల్పించిన పంచాయతీరాజ్ మంత్రి పవన్‌కల్యాణ్, పర్యాటక, సాంస్కృతిక శాఖామంత్రి కందుల దుర్గేష్‌లకు సర్పంచ్ రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

ఫ్రంట్‌లైన్ హెల్త్ వర్కర్ దేవికి అరుదైన గౌరవం



రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఫ్రంట్‌లైన్ హెల్త్ వర్కర్ పెనుగొండ దేవి వరలక్ష్మికి అరుదైన గౌరవం లభించింది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఆధ్వర్యంలో రాజ్‌భవన్‌లో ఆదివారం జరిగే ఎట్ హోం కార్యక్రమానికి దేవి వరలక్ష్మిని ఆహ్వానించినట్టు డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు తెలిపారు.ఆమె ధవళేశ్వరం పీహెచ్‌సీ ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్ పిడింగొయ్యి -3లో ఎంఎల్‌హెచ్‌పీగా పనిచేస్తున్నారు.



భారత దేశంలో ప్రజాస్వామ్యానికి పునాది ఓటు హక్కు అని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి అన్నారు. రాజమహేంద్రవరంలో శనివారం జరిగిన ఓటరు దినోత్సవానికి కలెక్టర్ ప్రశాంతి హాజరయ్యారు. తొలుత వైజంక్షన్ నుంచి నిర్వహించిన ఓటరు దినోత్సవ ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ ఆనం కళాకేంద్రానికి చేరుకుంది.. అక్కడ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఎగరాలి మువ్వన్నెల జెండా

కొవ్వూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కొవ్వూరు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ హైస్కూల్ విద్యార్థులు 100 అడుగుల జాతీయ పతాకంతో పట్టణ పుర వీధుల్లో ర్యాలీ చేశారు. కొవ్వూరు థియేటర్ సెంటర్‌లోని డా.ఎస్ఆర్‌కె హైస్కూల్ విద్యార్థులు జాతీయ నాయకుల వేషధారణలు ధరించి శనివారం 100 అడుగుల జాతీయ పతాకంతో అల్లూరి సీతారామరాజు సెంటర్, విజయవిహార్ మీదుగా బస్టాండ్ సెంటర్ నుంచి తిరిగి మరలా పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రధాన సెంటర్లలో రిపబ్లిక్ డే ప్రత్యేకతను తెలియజేస్తూ విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేలా నృత్య ప్రదర్శనలు చేశారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.





కొవ్వూరు పట్టణంలో ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న రెవెన్యూ, సచివాలయ సిబ్బంది

నేడు ఎంపీ పురందేశ్వరి చాగల్లు పర్యటన

చాగల్లు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి ఆదివారం చాగల్లు మండలంలో పర్యటిస్తారు. పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాల కార్యక్రమంలో పాల్గొంటారని బీజేపీ మండలపార్టీ అధ్యక్షుడు తాళ్ళూరి వరప్రసాద్ తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనే ఈకార్యక్రమంను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ప్రతి ఒక్కరూ..

ఓటు హక్కు వినియోగించుకోవాలి

• కొవ్వూరు ఆర్డీవో కార్యాలయ ఏవో జవహర్ బాజీ • ఘనంగా ఓటరు దినోత్సవ వేడుకలు • విద్యార్థులచే ర్యాలీలు

కొవ్వూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఓటరుగా నమోదైన ప్రతిఒక్కరూ ఎన్నికలలో తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కొవ్వూరు ఆర్డీవో కార్యాలయ ఏవో జి.ఎస్.ఎస్.జవహర్ బాజీ అన్నారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా స్థానిక విజయవిహార్ సెంటర్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ పురవీధులలో రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, పాఠశాల విద్యారులతో ర్యాలీ చేపట్టారు. ఆర్డీవో కార్యాలయ సెంటర్‌లో మానవహారం నిర్వహించి ఓటు ప్రాముఖ్యతను తెలియజేస్తూ నినాదాలు చేశారు. విద్యార్థులతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కొత్తగా ఓటు నమోదు చేసుకున్న యువ ఓటర్లకు గుర్తింపు కార్డులు అందజేశారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని నియోజకవర్గస్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, డిబేట్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. యువ ఓటర్లు నమోదులో ప్రతిభ కనబర్చిన బూత్‌లెవిల్ అధికారులకు ఉత్తమ ప్రతిభా అవార్డులను అందించారు. ఆర్డీవో కార్యాలయ ఏవో జి.ఎస్.ఎస్.జవహర్ బాజీ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం భారతదేశం అన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటుహక్కు నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి పౌరుడు రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును వినియోగించుకోవడం ద్వారా మంచి నాయకులను ఎన్నుకోవచ్చునన్నారు. ఓటరుగా నమోదైన ప్రతిఒక్కరూ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా తప్పనిసరిగా 100శాతం ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్వీప్ కోఆర్డినేటర్ జోడాల వెంకట్, ఎన్నికల డీటీ కె.నిరంజన్, డిప్యూటీ తహసీల్దార్‌లె కె.రవివిక్రమ్, సీహెచ్ ప్రజ్ఞావాసంతి, మండల విద్యాశాఖాధికారి రామకిషోర్, ఆర్ఐ బి.విశ్వేశ్వరరావు, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ షేక్ అబ్దుల్ నజీమ్, బీఎల్‌వోలు, సచివాలయ కార్యదర్శులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటు.. వజ్రాయుధం

నిడదవోలు: ఓటు హక్కు వజ్రాయుధమని అర్హత కలిగిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ అన్నారు. శనివారం నిడదవోలు పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ ఓటరు దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ డాక్టర్ రుద్ర అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న తహసీల్దార్ బి.నాగరాజునాయక్ మాట్లాడుతూ 15వ జా తీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకుని యువతకు ఓటు హక్కుపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం పలువురు సీనియర్ సిటిజన్‌లను ఘనంగా సత్కరించారు. కళాశాల ఆవరణలో విద్యార్థినీలు మానవహారం నిర్మించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఎస్ఐ పి.శోభన్ కుమార్, టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ ఎస్.సుప్రియ, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు ఎంతో పవిత్రమైనది

పెరవలి: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో సీనియర్ ఓటర్లను సత్కరించారు. ఈ సందర్భంగా పెరవలిలోజరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ అచ్యుతకుమారి పాల్గొని మాట్లాడుతూ ఓటుహక్కు ఎంతో పవిత్రమైనదని దేశ భవిష్యత్‌ను నిర్ణయించేది ఓటేనని అందువల్ల ప్రతీఒక్కరూ ఓటు హక్కు పొంది సద్వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పెరవలి ప్రముఖులు బొడ్డు రామాంజనేయులు, రాపాక ప్రమీల, జోషఫ్, సలాది కృష్ణమూర్తి పాల్గొన్నారు.

దేవరపల్లి : ప్రతీఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని ఓటును సక్రమంగా వినియోగించుకోవాలని దేవరపల్లి ఎస్ఐ సుబ్రహ్మణ్యం, డీటీ శ్రీనివాస్ అన్నారు. దేవరపల్లిలో జాతీ య ఓటర్ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక బీహెచ్ఎస్ఆర్ వీఎల్ఎం డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు రెవెన్యూ, పోలీసు అధికారులు స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి దేవరపల్లి బస్టాండ్‌వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సుబ్రహ్మణ్యం, డీటీ శ్రీనివాస్‌లు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని ఓటు మనచేతిలో వజ్రాయుధం లాంటిదన్నారు. పంచాయతీ కార్యదర్శి ఎన్.రవికిషోర్, వీఆర్వోలు పండుబాబు, కామాక్షి లక్ష్మి, అనీత, కళాశాల ఉపాధ్యాయులు ఎస్.వెంకటేష్, పసలపూడి జయబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోపాలపురం: ఓటు వజ్రాయుధం లాంటిదని తహసీల్దార్ కే.అజయ్ బాబు అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని చెక్‌పోస్టు వరకు విద్యార్థులచే శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం చెక్‌పోస్టు సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో తహసీల్దార్ అజయ్‌బాబు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఓటు వజ్రాయుధం లాంటిదన్నారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్లను సన్మానించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఆయా శాఖాధికారులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు ప్రధానం

చాగల్లు: ప్రజాస్వామ్యం విజయవంతం ఓటు హక్కు వినియోగంపైనే ఆధారపడి ఉంటుందని తహసీల్దార్ ఎం.మెరికమ్మ అన్నారు. శనివారం జాతీయ ఓటర దినోత్సవం సందర్భంగా ఓటు హక్కు నమోదు, వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. యువత ఓటు హక్కుపై నిర్లక్ష్యం వీడి బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహి ంచారు. సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. హైస్కూల్ విద్యార్థులతోపాటు ఎంపీడీవో ఆర్.శ్రీదేవి, ఎస్ఐ కె.నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల: జాతీయ ఓటరు దినోత్సవ వేడుకలను నల్లజర్లలో ఘనంగా నిర్వహించారు. శనివారం ఎస్ఆర్‌కే కళాశాలలో విద్యార్థులచే అవగాహన ర్యాలీని తహసీల్దార్ నాయుడు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన ప్రతిఒక్కరు ఓటుహక్కు కలిగి ఉండాల న్నారు. కార్యక్రమంలో డీటీ శాంతి ప్రియా, వీఆర్వో సురేష్‌కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు. తెలికిచర్ల జడ్పీ హైస్కూల్‌లో సర్పంచ్ బండి చిట్టి ఆధ్వర్యంలో సినియర్ సిటిజన్ ఓటర్లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు సుంకర సుబ్బారావు, జనసేన నాయకులు రుద్ర శ్రీను పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: అర్హత కలిగిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని తహసీల్దార్ పీవీఎన్‌డీ ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఉండ్రాజవరంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ ఓటుహక్కు ప్రాధాన్యంను వివరించారు. ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. వృద్ధ ఓటర్లను సత్కరించారు. కార్యక్రమంలో డీటీ కనకదుర్గ, అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



పెరవలి: సీనియర్ ఓటర్లను సత్కరిస్తున్న తహశీల్దార్ అచ్యుతకుమారి



నిడదవోలులో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు



గోపాలపురం సెంటర్‌లో మానవహారం ఏర్పడి ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



దేవరపల్లిలో జాతీయ ఓటర్ దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జాతీయ క్రీడలకు రిఫరీగా మద్దుకూరి సుధాకర్ ఎంపిక



కొవ్వూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాఖండ్ రిషికేష్‌లో జరగనున్న జాతీయ క్రీడలకు రిఫరీగా కొవ్వూరు పట్టణానికి చెందిన మద్దుకూరి సుధాకర్ ఎంపికయ్యారు. విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో సీనియర్ పాసింజర్ ట్రైన్ మేనేజర్‌గా పనిచేస్తున్న మద్దుకూరి సుధాకర్‌ని జాతీయ బీచ్ హ్యాండ్‌బాల్ పురుషులు, మహిళల పోటీలకు రిఫరీగా భారతీయ ఒలింపిక్ సంఘం ఎంపిక చేసిందన్నారు. జనవరి 26 నుంచి ఫిబ్రవరి 1 వరకు ఉత్తరాఖండ్‌లోని రిషికేష్‌లో జరుగుతున్న 38వ జాతీయ క్రీడలలో రిఫరీగా ఎంపిక చేయడంపై సుధాకర్ ఆనందం వ్యక్తం చేశారు.

ఆలయ వార్షికోత్సవం



పూజలుచేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, జనవరి25 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండలం ఐ.పంగి డి గ్రామంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రత్యేక పూజలు చేశారు. శనివారం ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవ మహోత్సవాలు నిర్వహించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆంజనేయస్వామిని దర్శించుకుని పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం జరుగుతున్న అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, పొట్టు సిద్ధూ, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, కె.విజయకుమార్, గ్రామంలో నాయకులు భక్తులు పాల్గొన్నారు.

పెత్తందార్ల కొమ్ముకాస్తున్న మోదీ ప్రభుత్వం

• కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షుడు రఫీయుల్లాబేగ్

కొవ్వూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మోదీ ప్రభుత్వం పెత్తందారుల కొమ్ముకాస్తుందని కాంగ్రెస్‌పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు ఎం.డి.రఫీయుల్లాబేగ్ అన్నారు. కొవిడ్ కారణంగా కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో నిలుపుదలచేసిన 18 రైళ్లను వెంటనే కొవ్వూరులో హాల్ట్ కల్పించాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో మంత్రులు, ఎంపీలకు, కూటమి ప్రభుత్వంలో ప్రస్తుత ఎంపీ పురందేశ్వరికి కొవ్వూరులో రైళ్ల హాల్ట్ కల్పించాలని వినతి పత్రాలు అందించామన్నారు. ఇంతవరకు ఏం ప్రయోజనంలేదన్నారు. ఎక్స్‌ప్రెస్ రైళ్ల, విమానాల వలన పేద ప్రజలకు ఉపయోగంలేదు. విమానాశ్రయాల పేరుతో భూములు సేకరిస్తున్నారు. దీనివలన బియ్యం కొరత ఏర్పడుతుంది. బ్రిటీష్ ప్రభుత్వంలో బర్మా నుంచి బియ్యం దిగుమతి చేసుకునేవారు. మరలా ఆ పరిస్థితి వస్తుందన్నారు. ప్రభుత్వానికి ఆదాయం తీసుకువచ్చే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఆధునీకరించాలన్నారు. బస్‌షెల్టర్‌లు చుట్టూ ఆక్రమణలు జరుగుతున్నాయి. డిపో మేనేజర్లు పర్యవేక్షించడం లేదన్నారు. పేద ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కొవ్వూరు రైల్వే స్టేషన్‌లో కొవిడ్ ముందు ఆగే అన్ని రైళ్లకు హాల్ట్ కల్పించాలని డిమాండ్ చేశారు.

'పశువైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి'

పెరవలి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పాడి పశువులకు ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి డాక్టర్ సల్మా పేర్కొన్నారు. శనివారం పిట్టలవేమవరంలో ఉచిత పశువైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 32 పశువులకు గర్భ కోశ వ్యాధులకు చికిత్స చేశారు. మినరల్ మిక్చర్ ప్యాకెట్లు, నట్టల నివారణ మందులు అందజేశారు. సర్పంచ్ చినవెంకటరెడ్డి, ఎంపీటీసీ దిలీప్‌రాజు, గ్రామ నాయకులు పురుషోత్తం, వెంగళరావు, పశువైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

మిరియాలకు పద్మశ్రీ

కళకు ప్రాణం పెట్టిన అప్పారావు

రావులపాలెం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సినిమాలు, టీవీలు ప్రాచుర్యం లేని రోజుల్లో బుర్రకథకు మంచి క్రేజ్ ఉండేది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతో ముఖ్యంగా కోనసీమతో అనుబంధం ఉన్న మిరియాల అప్పారావు 1949లో కరప మండలం నడకుదురు గ్రామంలో మిరియాల వెంకటరామయ్య- తిరుపతమ్మలకు జన్మించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో 1969లో బుర్రకథ రంగంలో అడుగుపెట్టి డ్రాయింగ్ మాస్టర్, జూనియర్ నాజర్, రామిశెట్టి వీరేశం గురువుల వద్ద శిష్యరికం చేసి ప్రధాన కథకునిగా ప్రావీణ్యం పొందారు. అనంతరం అక్కడ మొదలుపెట్టిన ప్రస్థానం వెనుతిరిగి చూడకుండా ఎన్నో స్టేజీ ప్రోగ్రాంలు చేశారు. 1974లో ఆల్‌ఇండియా రేడియోలో, 1993లో దూరదర్శన్‌లో ప్రోగ్రాంలు ఇచ్చారు. 1975లో పెద్దాపురంలో నిర్వహించిన బుర్రకథ పోటీలో ప్రథమస్థానం సాధించి 50 తులాల వెండి కప్‌ను ముప్పన రామారావు చేతుల మీదుగా అందుకున్నారు. 365 రోజుల్లో 300 రోజులు బుర్రకథ చెప్పిన ఘనుడు ఈయన. 50 ఏళ్ల బుర్రకథ ప్రస్థానంలో అలుపెరగకుండా ఎన్నో స్టేజీ ప్రదర్శనలు చేసి ప్రేక్షకుల మన్ననలను పొందారు. ప్రస్తుతం బుర్రకథ చెప్పేవారిలో 70 శాతం మంది కళాకారులు ఈయన శిష్యులే. ఈయనకు గానగంధర్వ, గాన కోకిల, బుర్రకథ టైగర్, బుర్రకథ మాస్టర్, బుర్రకథ పితామహుడు, వైఎస్సార్ లైఫ్ అచీవ్‌మెంట్ తదితర అవార్డులను, బిరుదులను పొందారు. ఆయన తణుకు షణ్ముఖ ఆంజనేయరాజు నేతృత్వంలోని నాటక కళా సమితిలో పలు నాటకాల్లోనూ ఈయన నటించారు. శ్రీకృష్ణ తులాభారంలో కృష్ణుడు, చింతామణిలో బిల్వమంగళుడు పాత్రలతో ప్రేక్షకుల మదిని దోచారు. ఈయన 1969 నుంచి ప్రారంభించిన స్టేజీ ప్రోగ్రాంలు ఆయన ఓపిక ఉన్నంత వరకు కొనసాగిస్తు వచ్చారు. ఇప్పటివరకు 5 వేలకుపైగా స్టేజీ ప్రోగ్రామ్‌లు ప్రదర్శించారు. మిరియాల అప్పారావు కుటుంబం ఆయనతో పాటు కళారంగంలోనే కొనసాగుతున్నారు.అప్పారావుకు భార్య, ఐదుగురు సంతానం. వారిలో రావులపాలెంలో ఉంటున్న బ్రహ్మాజీ, సుబ్బరాజు, బాబా అనే కుమారులు, వీరనాల లలిత (రావులపాలెం) యడవల్లి శ్రీదేవి (తాడేపల్లిగూడెం) అనే ఇద్దరు కుమార్తెలు కూడా బుర్రకథ కళారంగంలోనే కొనసాగుతుండడం విశేషం. కళారంగానికి వన్నెతెచ్చిన మిరియాల అప్పారావు ఈనెల 15వ తేదీన అనారోగ్యంతో రావులపాలెంలోని కుమారుడు బ్రహ్మాజీ ఇంటి వద్ద తుదిశ్వాస విడిచారు. కళారంగంలో ప్రావీణ్యం చెందిన అప్పారావు మృతితో కుటుంబ సభ్యులు, ఆయన శిష్య బృందం విచాకరంలో ఉండగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మశ్రీ అవార్డుతో ఆనందం వ్యక్తం చేశారు.

తహశీల్దార్ రాజ్యలక్ష్మికి జిల్లా ఉత్తమ సేవా అవార్డు



కలెక్టర్ ప్రశాంతి నుంచి అవార్డు అందుకుంటున్న తహసీల్దార్ రాజ్యలక్ష్మి

దేవరపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి తహసీల్దార్ మండలంలో అసిస్టెంట్ ఎలక్ట్రోల్ రిటర్నింగ్ అధికారిగా చేసిన సేవలకు శనివారం జాతీయ ఓటరు దినోత్స వం సందర్భంగా రాజమహేంద్రవరంలో ఆనం కళాకేంద్రంలో తహసీల్దార్ రాజ్యలక్ష్మి కలెక్టర్ నుంచి అవార్డు తీసుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ తూర్పుగోదావరిజిల్లా 19మండలాల్లో ఓటర్ నమోదుకు జిల్లాస్థాయి అవార్డు ఇవ్వడం ఎంతో గర్వకా రణంగా ఉందని ఈ అవార్డు రావడానికి ఉన్నతాధికారుల సలహాలు కిందిస్థాయి అధికారుల సహకారంతో ఈ అవార్డు పొంది నట్లు తెలిపారు. ఓటరు నమోదుకు సహక రించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

బూత్ లెవెల్ అధికారులకు, స్వీప్ కోఆర్డినేటర్‌కు అవార్డులు



అవార్డును అందుకుంటున్న ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు

తాళ్లపూడి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గస్థాయిలో ప్రతిభ చూపిన ప్రక్కి లంక బూత్ లెవెల్ అధికారు లు గరగ వనిత, ఇందుగుల శాంతి, శీలబోయిన కవితలతో పాటు కొవ్వూరు నియోజకవర్గ స్వీప్ కోఆర్డినేటర్, అంబాసిడర్ జోడాల వెంకటేశ్వరరావు ప్రతిభా పురస్కారాలకు ఎంపికయ్యారు. శనివారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో పరిపాలనా అధికారి జవహర్ బాజీ, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ నిరంజన్‌ల నుంచి అవా ర్డులు అందుకున్నారని తాళ్లపూడి ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు తహసీల్దార్ కార్యాలయంలో తెలిపారు.

సూపర్‌సిక్స్ పథకాల అమలులో వైఫల్యం

• జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వేశ్వరరెడ్డి

కొవ్వూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సూపర్‌సిక్స్ పథ కాలు అమలుచేయడంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు టి.కె.విశ్వేశ్వరరెడ్డి విమర్శించారు. తాళి బచావో కార్యక్రమంలో భాగంగా శనివారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ నాయకులు కంచాలు కొడుతూ నిరసన ప్రదర్శన చేపట్టారు.రాష్ట్రానికి ఒక్క కాంగ్రెస్‌తోనే మేలు జరుగుతుందన్నారు. మార్టిన్ లూథర్, రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మన్ వడయార్, కిసాన్ సెల్ ఉపాధ్యక్షులు కాకర్ల హరిబాబు, జిల్లా మాజీ అధ్యక్షుడు ఎం.డి.రఫీయుల్లాబేగ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సాకా పుల్లారావు, శారద పాల్గొన్నారు.

బాధ్యులపై కఠినచర్యలు తీసుకుంటాం

» ప్రమాదంపై పూర్తిస్థాయి విచారణ

» విమానాశ్రయ ఘటనపై స్పందించిన మంత్రి కందుల దుర్గేష్



విమానాశ్రయం వద్ద కూలిన టెర్మినల్ షెడ్‌ను పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే బలరామకృష్ణ, అధికారులను వివరాలు అడుగుతున్న ఎంపీ పురందేశ్వరి

కోరుకొండ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మధురపూడి విమానాశ్రయం (రాజమహేంద్రవరం) టెర్మినల్ విస్తరణ పనుల్లో జరిగిన సంఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపించి, బాధ్యులపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. శనివారం రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణతో కలిసి విమానాశ్రయంలో జరిగిన ప్రమాదస్థలిని పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. కొంత కాలంగా ఇక్కడ టెర్మినల్ విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో మొదటి అంతస్తు పై కప్పు ఏర్పాటు చేస్తుండగా పైన ఉన్న గిడ్డర్లు బోల్టులు బిగించడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. అదృష్టవశాత్తూ ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పిందన్నారు. ఏది ఏమైనా ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు జాగ్రత్త వహించాలన్నారు. ఈ విషయంపై కేంద్రపౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో మాట్లాడతామన్నారు. దీనికి సంబంధించి నివేదికను అధికారులతో తెప్పించుకుని ఏ విధంగా ముందుకెళ్లాలో పరిశీలిస్తామన్నారు. మంత్రి వెంట ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి నాయకులు ఉన్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన వారిలో రుడా ఛైర్మన్ బీవీఆర్‌చౌదరి, కలెక్టర్ పి.ప్రశాంతి, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, అధికారులు, ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

ఎంపీ పురందేశ్వరి పరిశీలన

విమానాశ్రయంలో కూలిన టెర్మినల్ ప్రదేశాన్ని శనివారం రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి పరిశీలించారు. అనంతరం అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పైన ఉన్న గిర్డర్లబోల్ట్‌లు బిగించడంవల్లే ప్రమాదం జరిగినట్టు ఆమెకు అధికారులు వివరించారు. కాంట్రాక్ట్ తీసుకున్న చెన్నై రెనాటస్ ప్రాజెక్టు ఎండీ మనోజ్ పూనప్పన్, వైస్ ప్రెసిడెంట్ ఖరుబాకరమ్, ప్రాజెక్టు డీజీ ఎం శరవణ్‌ను నిలదీశారు. ఈఘటనపై ఎంపీ మీడియా అడిగిన ప్రశ్నలకు బదులిస్తూ కేంద్ర పౌరవిమా నయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడుతో మాట్లాడానన్నారు. విమానయాన అధికారులు విచారణ చేపట్టారని చెప్పారు. నివేదిక అందిన తరువాత నిర్మాణంలో లోపాలు ఉన్నట్టు తేలితే బాధ్యులపై చర్యలుఉంటాయని హెచ్చరించారు.

రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 వసంతాలు

చాగల్లు, జనవరి 25, (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శనివారం ఎస్సీ ఏరియాలోని అంబేడ్కర్ విగ్రహంవద్ద బీజేపీ నాయకులు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. రాజ్యాంగ రచన చేసిన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మన రాజ్యాంగమే మనకు హక్కులతో పాటు బాధ్యతలు కల్పించిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తాళ్ళూరి వరప్రసాద్, గ్రంది రాంబాబు పాల్గొన్నారు.

'జాతీయ లోక్‌అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవాలి'



సమావేశంలో మాట్లాడుతున్న కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి అనూరాధ

కొవ్వూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రా జీ చేసుకోవాలని కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.అనూరాధ అన్నారు. శనివారం కొవ్వూరు కోర్టు హాలులో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. అదనపు జిల్లా జడ్జి ఎం. అనూరాధ మాట్లాడుతూ మార్చి 8న జరుగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా న్యాయవాదులు సహకరించాలన్నారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం వలన సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి జి.వి.ఎల్. సరస్వతి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.సాయికృష్ణ, 2వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కె.నాగలక్ష్మి, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు కొవ్వూరు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శనివారం కొవ్వూరు కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, డెంటల్, కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఫిక్కి నాగేంద్రకు సత్కారం



బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగేంద్రను సత్కరిస్తున్న కేశవ

కొవ్వూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా నూతన అధ్యకుడిగా ఎంపికైన పిక్కి నాగేంద్రను కొవ్వూరు బీజేపీ నాయకులు సత్కరించారు. బీజేపీ ఎస్సీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గెల్లా కేశవ శనివారం నాగేంద్రకు శాలువాకప్పి సత్కరించారు. కేశవ మాట్లాడుతూ సామాన్య కార్యకర్తలకు పెద్దపీట వేయడంలో బీజేపీ ముందుంటుందన్నారు. పార్టీకోసం నిరంతరం పాటుపడుతున్న కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్

తాళ్లపూడి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బల్లిపాడు ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కా ర్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో నిర్వహించారు.

'ఆర్థిక డిజిటల్ క్రియాత్మక అక్షరాస్యతను సాధించాలి '

పెరవలి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఆర్థిక డిజిటల్ క్రి యాత్మక అక్షరాస్యతను సాధించడమే ఉల్లాస్ కార్యక్రమం లక్ష్యమని మండల ఇన్‌చార్జి ఎంపీడీవో సీహెచ్ వెంకట రమణ పేర్కొన్నారు. శనివారం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం బండారు రామకృష్ణ ఆధ్వర్యంలో రెండోవిడత ఉల్లాస్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏపీఎం రామకృష్ణ మాట్లాడుతూ కేరళ తరహాలో నూటికి నూరుశాతం ఇక్కడ కూడా అక్షరాస్యత సాధించాల్సి ఉందన్నారు. మండలంలో 700 మంది అభ్యాసకులకు ఆర్థిక అక్షరాస్యతను నేర్పించాలన్నారు. దీని ద్వారా ఆర్థిక వనరులపై నియంత్రణ వస్తుందన్నారు. దీనివల్ల రుణాలు తీసుకోవడంతోపాటు స్వయం సహాయక సంఘాలకు స్థిరత్వం ఏర్పడుతుందన్నారు. మొబైల్ బ్యాంకింగ్, ఆన్‌లైన్ చెల్లింపులపై అవగాహన కలుగుతుందన్నారు. కార్యక్రమంలో హౌసి ంగ్ ఏఈ విక్టర్‌బాబు, కమ్యూనిటీ కోఆర్డినేటర్ కనకదుర్గ, మహాలక్ష్మి పాల్గొన్నారు.

కందిపప్పుకు డీడీలు చెల్లించాలి

నల్లజర్ల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) :రేషన్ డీలర్లు కందిపప్పుకు డీడీలు చెల్లించి ప్రతి లబ్ధిదారుడికి కందిపప్పు అందేవిధంగా చూడాలని సివిల్ సప్లై డీటీ సత్యనారాయణ రాజు అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లు, ఎండీయూ అపరేటర్లకు సమీక్షా సమావేశం నిర్వహించారు. డీటీ మాట్లాడుతూ ఫిబ్రవరి నెలకు సంబంధించి కందిపప్పుతోపాటు పంచదార, బియ్యం అందిస్తామన్నారు. 1వ తేదీ ఉదయం 6గంటల నుంచే ప్రజాపంపిణీ ప్రారంభించాలని పేర్కొన్నారు. ముగ్గురు ఎండీయూ అపరేటర్ల స్థానంలో కొత్తవారిని నియమిస్తామని ఎండీయూ ఆపరేటర్లు ప్రజలతో వివాదాలు లేకుండా సరుకులను సక్రమంగా అందించాలన్నారు. డీటీ శాంతిప్రియా, డీలర్లు వరకుమార్, వెంకన్న,బి.లక్ష్మణరావు, ఎండీయూ ఆపరేటర్లు వసంతాడ ఇశ్రాయేలు, చంద్రరావు, రమేష్ పాల్గొన్నారు.